ఏలూరు **ఉష్ణోగ్రతలు**

గరిష్ఠం : 39.0

కనిష్ఠం : 27.0



వాహనాల పన్ను చెల్లించకుంటే

పెనాల్టీ విధిస్తాం

ఏలూరు క్రైం, మే 8(ఆంధ్రజ్యోతి): పన్ను చెల్లింపు గడువు ముగిసినా కొందరు యజమానులు కట్టకుండా తమ వాహనాలను రోడ్లపై తిప్పుతున్నారని డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమీషనర్ షేక్ కరీమ్ తెలిపారు. ఈ నేపథ్యంలో గురువారం జిల్లావ్యాప్తంగా ప్రత్యేక తనిఖీలు చేపట్టినట్లు తెలిపారు. తనిఖీల్లో ఈ నెల ఒకటో తేదీ నుంచి ఇప్పటి వరకు పన్నులు కట్టని రవాణా వాహనాలపై 115 కేసులు నమోదు చేసి రూ.7.53 లక్షలు అపరాధ రుసుము విధించినట్టు ఆయన తెలిపారు. ఎక్కడైనా వాహనంపై కేసు నమోదు చేస్తే పన్నుతో పాటు 200 శాతం అదనంగా చెల్లించాలని, స్వచ్ఛందంగా పన్ను చెల్లిస్తే పన్నుతోపాటు 50 శాతం మాత్రమే అదనంగా చెల్లిస్తే సరిపోతుందని తెలిపారు. జిల్లాలో తనిఖీలు కొనసాగిస్తామని తెలిపారు.



మత్స్యావతారంలో

చినవెంకన్న

ద్వారకాతిరుమల చిన వెంకన్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం స్వామి మత్స్యావతారంలో దర్శనమిచ్చారు. మరోవైపు బ్రహ్మోత్సవాలను తిలకించేందుకు సకల చరాచర సృష్టికి ఆహ్వానం పలుకుతూ గురువారం రాత్రి ధ్వజారోహణ వేడుక వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

■ లోపలి పేజీలో..



కాళ్లకూరు

వెంకన్న కల్యాణం

పశ్చిమగోదావరి జిల్లా కాళ్లకూరు శ్రీ వేంకటేశ్వర స్వామి తిరుకల్యాణోత్సవాల్లో భాగంగా గురువారం స్వామి కల్యాణం కన్నుల పండువగా జరిగింది. తొలుత స్వామికి గరుడ సేవ నిర్వహించారు. వేద పండితులు, ఆలయ అర్చకుల వేద మంత్రోచ్ఛరణల మధ్య డిప్యూటీ స్పీకర్ కనుమూరు రఘురామ కృష్ణంరాజు-రమాదేవి దంపతులు కల్యాణోత్సవం వైభవంగా జరిపారు.

రైతన్నకు అండగా..



అన్నదాత సుఖీభవ పథకం అమలుకు గ్రీన్‌సిగ్నల్

- ఈనెల 20వ తేదీ లోగా అర్హుల గుర్తింపు
- కౌలు రైతులకూ పథకం వర్తింపు.. సీసీఆర్‌సీ కార్డుల జారీ ప్రక్రియ
- పీఎం కిసాన్‌తో కలిపి ప్రతి రైతుకు రూ.20 వేలు
- ఆనందం వ్యక్తం చేస్తున్న రైతులు

ప్రభుత్వం రైతులకు తీపి కబురు అందించింది. అన్నదాత సుఖీభవ పథకాన్ని ఈ నెలలోనే అమలు చేయనున్నట్టు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించడంతో జిల్లా వ్యాప్తంగా అన్నదాతల్లో ఆనందం వెల్లివిరుస్తోంది.

ఏలూరు సిటీ, మే 8(ఆంధ్రజ్యోతి): అన్నదాత సుఖీభవ పథకాన్ని అమలు చేసి, కుటుంబాన్ని యూనిట్‌గా తీసుకుని ప్రతి రైతుకు రూ.20 వేల చొప్పున సాయం అందించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ముందుగా సొంత భూమిగల భూయజమానుల్లో అర్హులను గుర్తించనున్నారు. ఈ మేరకు సొంత భూములు కలిగిన భూ యజమానుల పేర్లతో ఉన్న జాబితాలను ప్రభుత్వం జిల్లాలకు పంపించింది. ఈ జాబితాలో అర్హులైన రైతులను గుర్తించాలని ఆదేశించింది. గత ప్రభుత్వ హయాంలో రైతు భరోసా అందుకున్న అన్నదాతల జాబితాలో వడపోతకు సన్నాహాలు ప్రారంభమయ్యాయి. అర్హుల గుర్తింపులో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం తాజాగా లాగిన్‌లు కేటాయించింది.

అర్హుల గుర్తింపు ఇలా..

సొంత భూములు కలిగిన భూయజమానుల్లో అర్హుల గుర్తింపు ప్రక్రియ ప్రారంభం అయింది. ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ లు, జడ్పీ ఛైర్మన్లు, రాష్ట్రప్రభుత్వ, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఈ పథకం వర్తించదు. రిటైర్డ్ ఉద్యో గులలో నెలకు రూ.10 వేలు దాటి పించన్ పొందే వారు అనర్హులు. ఆక్వా సాగు చేసే రైతులకు ఈ పథకం వర్తించదు. ఇన్‌కంటాక్స్ కడుతున్న వారికి వర్తించదు.

కౌలు రైతులకూ అండగా

అన్నదాత సుఖీభవ పథకాన్ని కౌలు రైతు లకు వర్తింప జేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయిం చింది. రెండు లక్షల మంది వరకు జిల్లాలో కౌలు రైతులు ఉన్నా గతేడాది 68 వేలు మంది మాత్రమే కౌలు రుణ అర్హత కార్డులను పొందారు. ఈ ఏడాది ఈ సీసీఆర్‌సీ కార్డుల జారీ లక్ష్యాన్ని 75 వేల వరకు పెంచారు. కార్డుల జారీ ప్రక్రియ ప్రారంభమైంది. రాష్ట్ర ప్రభుత్వమే ప్రతి కౌలు రైతుకు రూ.20 వేల ఆర్థిక సాయం అందించాలని నిర్ణయించింది. ప్రస్తుతం జరుగుతున్న సొంత భూములు కలిగిన భూయజమానుల గుర్తింపు ప్రక్రియ పూర్తయిన తర్వాత సీసీఆర్‌సీ కార్డు దారు లందరికీ ఈ పథకాన్ని ఈ నెలలోనే వర్తింపజేస్తారని తెలుస్తోంది. గత ప్రభుత్వ హయాంలో రకరకాల సాకులతో అర్హులైన కౌలు రైతులను పక్కనబెట్టారు. టీడీపీ ప్రభుత్వం మాత్రం అర్హులైన ప్రతి కౌలు రైతుకు ఈ పథకం వర్తింపజేయాలని నిర్ణయించింది.

సొంత భూమి రైతులు 3.80 లక్షలు

జిల్లాకు సంబంధించి 3.80 లక్షల మంది రైతుల పేర్లతో జాబితా వచ్చింది. ఇందులో ప్రభుత్వ విధివిధానాల ప్రకారం అర్హులను మండల స్థాయిలో గుర్తిస్తారు. ఈనెల 20వ తేదీలోగా అర్హుల గుర్తింపు ప్రక్రియ పూర్తి చేయాల్సి ఉంది. ఆపై గుర్తించిన అర్హులైన ప్రతి రైతుకు పీఎంకిసాన్ రూ.6వేలు, అన్నదాత సుఖీభవ రూ.14 వేలు కలిపి మొత్తం రూ.20 వేలు ఆర్థిక సాయంగా అందించనున్నారు.

అన్నదాతకు పండగే

అన్నదాత సుఖీభవ పథకాన్ని త్వరితగతిన అమలు చేయడం వల్ల వారి కుటుంబాల్లో పండుగ వాతావరణం కనబడుతోంది. రైతు భరోసా పేరుతో గత ఎన్నికల ముందు ఇచ్చిన హామీలకు జగన్ ప్రభుత్వం తూట్లు పొడిచి కేంద్ర ప్రభుత్వ వాటాతో కలిపి కేవలం రూ.13,500 మాత్రమే ఇచ్చి చేతులు దులి పేసుకుంది. ఈ నేపథ్యంలో రైతులకు అండగా చంద్రబాబు అర్హులైన ప్రతి రైతుకు రూ.20 వేలు సాయం అందిస్తామని ఎన్నికల ముందు హామీ ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం ఎన్నికల హామీలను ఒక్కొక్కటి అమలు చేస్తున్న ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పథకాన్ని ఈనెలలోనే అమలు చేసేందుకు నిధులను కేటాయించింది. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం అన్నదాతల్లో ఆనందాన్ని కలిగిస్తోంది.

రైస్ కార్డులకు

పచ్చజెండా



- త్వరలో కొత్త స్మార్ట్ రైస్ కార్డులు
- అర్హుల నుంచి దరఖాస్తుల స్వీకరణ
- మార్పులు, చేర్పులు, చిరునామా మార్పులకు అనుమతి

ఏలూరు సిటీ, మే 8(ఆంధ్రజ్యోతి):రాష్ట్రంలో రైస్‌కార్డుల కోసం ఎదురు చూస్తున్న ప్రజలకు తాజాగా రాష్ట్ర ప్రభుత్వం తీపికబురు అందించింది. నూతన రైస్‌కార్డుల కోసం అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని, దరఖాస్తులను గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా స్వీకరిస్తారని ఇటీవల పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ప్రకటించారు. నూతన రైస్ కార్డుల జారీతో పాటు కార్డుల విభజన, చిరునామా మార్పు, సభ్యులను కార్డులో చేర్చడం, ఉన్నవారిని తొలగించడం, కార్డులను సరెండర్ చేయడం వంటి మొత్తం ఆరు రకాల సేవలను అందుబాటులోకి తీసుకొచ్చారు రైస్‌కార్డులో తప్పుడు ఆధార్ నెంబర్ సీడింగ్‌ను సరిచేసుకునే అవకాశం కల్పించారు.

కొత్తకార్డులు.. విధి విధానాలు

కొత్తగా రైస్‌కార్డు తీసుకునే వారికి విధివిధానాలను ప్రకటించారు. గ్రామీణ ప్రాంతాల్లో నెలకు రూ.10 వేలు, పట్టణ ప్రాంతాలైతే నెలకు రూ.12 వేలలోపు ఆదాయం ఉన్నవారు ఈ కార్డు పొందడానికి అర్హులుగా ప్రకటించారు. మూడెకరాలోపు వెట్‌ల్యాండ్ గాని, 10 ఎకరాలలోపు డ్రై ల్యాండ్ కాని, రెండు కలిపి 10 ఎకరాలలోపు ఉండవచ్చు. నెలవారీ 300 యూనిట్లలోపు విద్యుత్ వినియోగం చేసుకోవచ్చు. పింఛన్ తీసుకునే రిటైర్డ్ ఉద్యోగ పెన్షనర్లు అనర్హులు. అయితే పారిశుధ్య కార్మికులు మాత్రం రిటైర్డ్ ఉద్యోగులైనా కార్డు పొందేందుకు అవకాశం కల్పించారు. నాలుగు చక్రాల వాహనం కలిగిన వారు ఈ కార్డు పొందడానికి అనర్హులు. అయితే ఉపాధి నిమిత్తం టాక్సీ, ట్రాక్టర్, ఆటో కలిగి ఉన్నప్పటికీ అర్హులుగా ప్రకటించారు. ఇన్‌కంటాక్స్ చెల్లించని వారు మాత్రమే కార్డు పొందడానికి అర్హులుగా ప్రకటించారు. ఇంటి స్థలం 1000 చదరపు గజాల లోపు ఉన్నవారే అర్హులు.

జూన్‌లో స్మార్ట్ కార్డుల జారీ

జూన్‌లో క్యూఆర్ కోడ్‌తో కొత్త స్మార్ట్ రైస్ కార్డుల జారీకి సన్నాహాలు చేస్తున్నారు. ఈ కార్డుతో దేశంలో ఎక్కడైనా రేషన్ తీసుకోవచ్చు. ఆ కార్డుపై కుటుంబ సభ్యుల వివరాలన్నీ ఉంటాయి. ఆ కార్డును స్కాన్ చేయగానే అన్ని వివరాలు కనిపిస్తాయి. డేటా బేస్‌కు ఈ కార్డును లింక్ చేయడం వల్ల సిస్టంలో ఆటోమేటిక్‌గా డేటా అప్‌డేట్ అవుతుంది. క్యూ ఆర్ కోడ్ స్కాన్ చేస్తే ఆరు నెలల రేషన్ వివరాలు తెలుస్తాయి.

జిల్లాలో రైస్ కార్డుదారులు 6,20,146

జిల్లాలో ఇప్పటివరకు 6,20,146 మంది రైస్‌కార్డుదారులున్నారు. ఈ కార్డులకు సంబంధించి 17,31,461 మంది సభ్యులు ఈకేవైసీ చేయించుకోవాల్సి ఉండగా ఇప్పటివరకు 16,15,078 మంది సభ్యులు ఈకేవైసీ చేయించుకున్నారు. ఐదేళ్లలోపు పిల్లలకు, 80 ఏళ్ల దాటిన వృద్ధులకు ఈకేవైసీ అవసరం లేదని ప్రభుత్వం పేర్కొనడంతో జిల్లాలో 25,030 మందికి ఈకేవైసీ నుంచి మినహాయింపు ఇచ్చారు. అనాధాశ్రమాల్లో ఉండే వృద్ధులకు రైస్ కార్డు లేకపోతే కొత్త కార్డుల కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. కాగా నూతన రైస్ కార్డుల జారీతో పాటు మార్పులు, చేర్పులకు సంబంధించి మొత్తం ఆరు రకాల సేవలను పొందడానికి రాష్ట్ర ప్రభుత్వం కల్పించిన అవకాశాన్ని సద్వినియోగించుకోవాలని రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

పరి-శోధనల్లేవ్..

ఫలాలూ లేవు!

- రైతులకు అక్కరకు రాని మామిడి పరిశోధన కేంద్రం
- 2004లో ఏర్పాటు.. ఇప్పటికీ ఎక్కడవేసిన గొంగళి అక్కడే
- పరిశోధనలకు 200 ఎకరాలు అవసరం
- అటువైపు చూడని పాలకులు

నూజివీడు మామిడి పరిశోధన కేంద్రం 2004లో ఏర్పాటు అయింది. ఈ కేంద్రానికి అవసరమైన 100 నుంచి 200 ఎకరాల భూమిని త్వరలోనే అందిస్తామని నాటి పాలకులు హామీ ఇచ్చారు. అప్పటి నుంచి ప్రభుత్వాలు మారినా అది ఇంతవరకు కార్యరూపం దాల్చలేదు. దీంతో మామిడి పరిశోధనా కేంద్రం ఉన్నా మామిడి తోటలపై పరిశోధన చేయడానికి శాస్త్రవేత్తలకు అవకాశం లేక ఉచిత సలహాలతో, అదీ కాలం తీరిన తర్వాత కాలక్షేపం చేస్తున్నారనే విమర్శలున్నాయి.

(నూజివీడు-ఆంధ్రజ్యోతి)

పేరుగొప్ప ఊరుదిబ్బ అన్నచందాన నూజివీడు మామిడి రైతుల పరిస్థితి ఉంది. ఇరవై ఏళ్లుగా మామిడి పంటలో సరైన దిగుబడులు రాక, చీడపీడలను అరికట్టలేక మార్కెట్లో ధర లేక వేలాది ఎకరాల్లో మామిడి తోటలను రైతులు ఇప్పటికే నరికి పామాయిల్, మొక్కజొన్న, పొగాకు వంటి వాణిజ్య పంటలవైపు మళ్లారు. ప్రస్తుతం ఉన్న మామిడి తోటలనైనా కాపాడుకోకపోతే నూజివీడులో మామిడి తోటలు కనుమరుగయ్యే పరిస్థితి ఉంది. పరిశోధనలకు 200 ఎకరాలు అవసరమని, మామిడి శాస్త్రవేత్తలు, రైతులు పలుమార్లు నేతలకు విజ్ఞప్తులు చేసినా పట్టించుకున్న నాథుడే లేడు. రైతుల పరిస్థితిని చక్కదిద్దడానికి ప్రభుత్వం భూసేకరణ చేయాల్సిన అవసరం లేదు. ఈ ప్రాంతంలో వేలాది ఎకరాల అటవీభూమి (అది చిట్టడివి) ఉంది. ఆ భూమిలో కేవలం 200 ఎకరాలను మామిడి పరిశోధనల నిమిత్తం ప్రభుత్వం కేటాయించవచ్చు.

శాస్త్రవేత్తల నుంచి కొరవడిన సహకారం

ప్రస్తుతం మామిడిని కోడిపేను కీటకం వల్ల తీవ్ర నష్టం జరుగుతోంది. శాస్త్రవేత్తలు రైతులకు చెందిన భూముల్లోనే దీనిని అరికట్టే విధానంపై పరిశోధనలు చేయిస్తున్నారు. అయితే ప్రయోగ ఫలాలను రైతులకు చేరవేయడంలో శాస్త్రవేత్తలు, అనుబంధ ఉద్యానవన అధికారులు వైఫల్యం చెందుతున్నారు. మామిడిపూత దశ సహజంగా నవంబరు చివరి వారం నుంచి ఫిబ్రవరి వరకు ఉంటుంది. అయితే ఫిబ్రవరిలో మామిడి పూతపై తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి శాస్త్రవేత్తలు అవగాహన సదస్సులు నిర్వహించడం వల్ల రైతులకు ఉపయోగం లేకుండా పోతోందన్న విమర్శలున్నాయి. ఇటీవల నూజివీడులో మామిడి రైతుల అవగాహన సదస్సు జరిగింది. ఈ సదస్సులో తాము ఎదుర్కొంటున్న సమస్యలను నూజివీడు ఎమ్మెల్యే, మంత్రి కొలుసు పార్థసారథి దృష్టికి శాస్త్రవేత్తలు, రైతులు తీసుకొచ్చారు. కనీసం తమకు 100 ఎకరాల భూమిని అయినా కేటాయించాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. మంత్రి ఈ ప్రతిపాదనను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతానని హామీ ఇచ్చారు. విజయవాడ నున్నలో ఉన్న మామిడి మార్కెట్‌లాగా నూజివీడులో మామిడి మార్కెట్ ఏర్పాటు చేయడానికి మంత్రి పార్థసారథి సన్నాహాలు ప్రారంభించారు. ఈ ఏడాదే ప్రారంభం కావాల్సిన మార్కెట్ ఆర్థికశాఖ వద్ద పెండింగ్‌లో ఉంది.

తోటలను స్థిరీకరించాలి

మామిడి పంట ఎగుమతుల తర్వాత, ముందు మామిడి తోటల విస్తీర్ణం తగ్గిపోకుండా స్థిరీకరించాల్సిన అవసరం ఉంది. ప్రస్తుతం ఉన్న తోటలనైనా కాపాడుకోవాలంటే రైతులకు భరోసా ఉండాలి. రైతులు ఎదుర్కొంటున్న చీడపీడల బారి నుంచి తమ తోటలను కాపాడుకునేలా అవసరమైన అన్ని చర్యలను ప్రభుత్వం చేపట్టాలి. గతంలో ఒకటి, రెండుసార్లు మామిడి పంటకు మందులు కొట్టే పరిస్థితి ఉండగా, నేడు 15 నుంచి 20 సార్లు కొట్టే పరిస్థితి ఉందంటూ రైతులు వాపోతున్నారు. మార్కెట్లో సరఫరా అవుతున్న పురుగుమందుల పైనా రైతులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. మామిడి రైతులను ఆదుకోవడానికి ప్రభుత్వం దృష్టి సారించాలని కోరుతున్నారు.





క్షేత్రస్థాయిలో అందడం లేదు

నూజివీడులో మామిడి పరిశోధన కేంద్రంలో సరిపడా సిబ్బంది లేక ఉన్న సిబ్బందిపైనే అదనపు భారం పడుతోంది. మామిడి పరిశోధన కేంద్రం క్షేత్రస్థాయిలో రైతులకు ఉపయోగపడడం లేదు.

- నిమ్మగడ్డ నరసింహం, రైతుసంఘం నాయకుడు



చీడపీడలతో నష్టపోయా..

ఈ ఏడాది మూడెకరాల మామిడి పంటను లక్షన్నర రూపాయలకు కౌలు తీసుకున్నా. కోడిపేను, నల్లి చీడపీడల వల్ల తీవ్రంగా నష్టపోయా. మాకు ఎప్పుడు నూజివీడు మామిడి పరిశోధన కేంద్రం నుంచి ఎలాంటి సస్యరక్షణ సలహాలు అందలేదు.

- బాణావతు రాములు, కౌలురైతు

■ లోపలి పేజీలో..



సమీక్షలో ఎంపీ మహేశ్, ఎమ్మెల్యే చింతమనేని, కలెక్టర్ వెట్రిసెల్వి, జేసీ ధాత్రిరెడ్డి

సమన్వయంతో పనిచేయాలి

దెందులూరు అభివృద్ధిపై అధికారులకు ఎంపీ పుట్టా, ఎమ్మెల్యే చింతమనేని దిశా నిర్దేశం

ఏలూరు, మే 8(ఆంధ్రజ్యోతి) : దెందులూరు నియోజకవర్గ అభివృద్ధికి సమన్వయంతో పనిచేయండి.. కొల్లేరు రైతుల విషయంలో అటవీ శాఖ అధికారులు మానవత దృక్పథం చూపాలంటూ.. ఎంపీ పుట్టా మహేశ్ కుమార్, దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అధికారులకు దిశా నిర్దేశం చేశారు. కలెక్టరేట్‌లో గురువారం దెందులూరు నియోజకవర్గ అభివృద్ధిపై సమీక్ష జరిగింది. వ్యవసాయ, ఉద్యాన, ఇరిగేషన్, పశుసంవర్థక శాఖ, పీఆర్, ఆర్‌అండ్‌బీ, విద్యుత్, రెవెన్యూ తదితర శాఖల అధికారులతో సమీక్షించారు. ఎంపీ మాట్లాడుతూ ఎంపీ ల్యాడ్స్‌కు సంబంధించి అసంపూర్తిగా మిగిలిన పనులను చేపట్టేందుకు ప్రతిపాదనలు సమర్పించాలని కోరారు. నియోజకవర్గ అభివృద్ధికి అన్ని విధాలా సహకారం అందిస్తానన్నారు. ఎమ్మెల్యే చింతమనేని మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలతో నియోజకవర్గం అభివృద్ధికి అధికారులంతా సమన్వయంతో పనిచేయాలన్నారు. ఆయిల్‌పామ్ పంటను ప్రోత్సహించేందుకు మొక్కలు, ఎరువులు, డ్రిప్ ఇరిగేషన్ తదితర సౌకర్యాలు కల్పిస్తే దెందులూరు, పెదవేగి మండలాల్లో 90 శాతం మంది రైతుల ఆయిల్‌పామ్ పంట వేసేందుకు

మిగతా 8వ పేజీలో

తొలి తప్పుగా వదిలేయండి!

- వైద్య ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శికి అభ్యర్థన
- కఠినచర్యలేవీ తీసుకోబోమని హామీ ఇచ్చారని 'ఏపీ-హంస' నాయకుల వెల్లడి

మత్స్య శాఖాధికారులపై విచారణకు ఆదేశం

■ లోపలి పేజీలో..





గవర్నర్ అబ్దుల్ నజీర్ నుంచి అవార్డులు అందుకుంటున్న కలెక్టర్లు నాగరాణి, ప్రశాంతి

రెడ్ క్రాస్ సేవలకు కలెక్టర్లకు అవార్డులు

భీమవరం టౌన్/ రాజమహేంద్రవరం, మే 8 (ఆంధ్రజ్యోతి): విపత్కర పరిస్థితుల్లో నిస్వార్థ సేవలందించడానికి ప్రతి ఒక్కరు ముందుండాలని పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి పిలుపునిచ్చారు. గత ఏడాది జిల్లాలో వరదల సమయంలో కలెక్టర్ అందించిన సేవలకు గుర్తింపుగా రెడ్‌క్రాస్ అవా ర్డుకు ఎంపికయ్యారు. విజయవాడ రాజ్ భవన్‌లో గురువారం నిర్వహించిన ప్రపంచ రెడ్ క్రాస్ దినోత్సవ కార్యక్రమాల్లో గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ నుంచి అవార్డు, బంగారు పతకాన్ని కలెక్టర్ నాగరాణి అందుకున్నారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ కార్యకలాపాలకు విస్తృత స్థాయిలో ప్రచారం కల్పించడం, ప్రజా ప్రయోజనాలకు సొసైటీ సేవలను సమర్థవంతంగా వినియోగించడంతో తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతికి రెడ్‌క్రాస్ సొసైటీ పురస్కారం దక్కింది. 2022-23లో పశ్చిమ గోదావరి కలెక్టర్‌గా విధులు నిర్వర్తించిన సమ యంలో సొసైటీ కార్యకలాపాలను చురుగ్గా అమలు చేయడంతో ఈ అవార్డుకు ఆమె ఎంపికయ్యారు.

పరిశ్రమల స్థాపనతో నిరుద్యోగులకు ఉపాధి

ఎంపీ పుట్టా మహేశ్‌కుమార్

పట్టాయగూడెంలో పారిశ్రామికవాడకు శంకుస్థాపన

చింతలపూడి, మే 8 (ఆంధ్రజ్యోతి) : పరిశ్రమల స్థాపన ద్వారా ఆ ప్రాంతం అభివృద్ధి చెందడమే కాకుండా నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఎంపీ పుట్టా మహేశ్ కుమార్ యాదవ్ అన్నారు. మండలం లో పట్టాయగూడెంలో పారిశ్రామికవాడకు గురువారం సాయంత్రం శంకు స్థాపన చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ పట్టాయగూడెంలో 69.50 ఎకరాల్లో రూ.13.50 కోట్ల వ్యయంతో పారిశ్రామి కవాడ అభివృద్ధి జరుగుతుందన్నారు. ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ మాట్లా డుతూ చింత లపూడి నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంద న్నారు. కలెక్టర్ వెట్రిజెల్వి, జడ్పీ ఛైర్‌పర్సన్ పద్మశ్రీ, మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళీ రామకృష్ణ, నియోజకవర్గ టీడీపీ నాయకుడు జగ్గవరపు ముత్తారెడ్డి, పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు.



శంకుస్థాపనలో పాల్గొన్న ఎంపీ మహేశ్ కుమార్, ఎమ్మెల్యే రోషన్‌కుమార్, జడ్పీ ఛైర్‌పర్సన్ పద్మశ్రీ, కలెక్టర్ వెట్రిసెల్వి



జిల్లా న్యాయసేవాధికార సంస్థ భవనంలో ట్రాన్స్ జెండర్స్‌కు అవగాహన కల్పిస్తున్న ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యాదర్శి కె.రత్నప్రసాద్

హిజ్రాలకు సమాన హక్కులు కల్పించాలి

జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి రత్నప్రసాద్

ఏలూరు క్రైం, మే 8 (ఆంధ్రజ్యోతి): సమాజంలో స్త్రీ, పురుషులతో సమానంగా హిజ్రాలకు కూడా సమానహక్కులను కల్పించా ల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందని అందరితో సమానంగా సంక్షేమ పథకాలను అందించాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె రత్న ప్రసాద్ అన్నారు. ఏలూరు జిల్లా కోర్టు ఆవరణలో డీఎల్‌ఎస్‌ఏ భవనంలో ట్రాన్స్‌జండర్స్‌కు అవగాహన సదస్సును గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జడ్జి రత్న ప్రసాద్ మాట్లాడుతూ ట్రాన్స్‌జండర్స్ చట్టాలపై అవగాహన పెంచుకుని ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. సమాజంలో ప్రతి ఒక్కరికి చట్టాలపై అవగాహన కల్పించాల్సిన బాధ్యత జిల్లా న్యాయసేవాధికార సంస్థపై ఉందని దీనిలో భాగంగానే హిజ్రాలకు ఈ అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామ న్నారు. రేషన్, వసతి, వైద్యం, తదితర సదుపాయలను హిజ్రాలకు ప్రభుత్వం ఏర్పాటు చేయాలన్నారు. సమాజంలో కొంత మంది ప్రజలు, అధికారులు వేధిస్తున్నారని వారి నుంచి రక్షణ కల్పించాలని హిజ్రాలు తమ దృష్టికి తీసుకువచ్చారని వారికి జిల్లా న్యాయసేవాధికార సంస్థ అండగా ఉంటుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో విభిన్న ప్రతిభావంతుల అదనపు డైరెక్టర్ బి రామ్‌కుమార్, చీఫ్ లీగల్ ఎయిడ్ కౌన్సిల్ పీఎన్‌వీ మునేశ్వరరావు, ట్రాన్స్ జండర్స్ పాల్గొన్నారు.

మత్స్య శాఖాధికారులపై విచారణకు ఆదేశం

కాకినాడ మే 8 (ఆంధ్రజ్యోతి): మత్స్య శాఖలో అధికారులుగా పనిచేస్తూ ప్రభుత్వ నిబంధనలకు తూట్లు పొడిచిన పలువురిపై శాఖాపరమైన విచారణకు ఆదేశిస్తూ ప్రభుత్వం జీవో విడుదల చేసింది. ఏలూరు మత్స్య శాఖ జేడీగా పనిచేసి ఉద్యోగ విరమణ చేసిన ఫణిశేఖర్, భీమవరం డిప్యూటీ డైరెక్టర్ తిరుపతయ్యలపై విచారణ చేపట్టాలని ఆదేశించింది. స్టేట్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫిషరీస్ టెక్నాలజీకు చెందిన అడిషినల్ డైరెక్టర్ ఆఫ్ ఫిషరీస్‌కు విచారణ బాధ్యతలు అప్పగించింది. ప్రభుత్వ నిధుల దుర్వినియోగానికి పాల్పడ్డారనే అభియోగాలపై ఏలూరు మత్స్య శాఖ సూపరింటెండెంట్‌గా పని చేసి రిటైర్ అయిన దీనదయాల్‌పైనా శాఖాపరమైన విచారణకు ఆదేశించారు.ఆరుగురు అధికారులపై ప్రభుత్వం విచారణకు ఆదేశించింది.



నోవా కళాశాల వద్ద బైఠాయించి ఆందోళన చేస్తున్న పూర్వ విద్యార్థులు

సర్టిఫికెట్లు ఇవ్వడం లేదంటూ విద్యార్థుల ఆందోళన

జంగారెడ్డిగూడెం,మే 8 (ఆంధ్రజ్యోతి): వేగవరం నోవా కళాశాలలో డీఈడీ, బీఈడీ, బీపీ ఈడీ పూర్తి చేసిన పూర్వ విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వడం లేదని 32 మంది విద్యార్థులు కళాశాల వద్ద గురువారం ఆందోళన చేపట్టారు. జంగారెడ్డిగూడెం మండలం వేగ వరంలో 2016 నుంచి 2020 వరకు డీఈడీ, బీఈడీ, బీపీ ఈడీ పూర్తి చేసిన విద్యార్థులు పదో తరగతి, ఇంటర్ ఒరిజినల్ సర్టిఫికెట్లు ఇచ్చి ఆయా ఉపాధ్యాయ కోర్సుల్లో చేరారు. వీరిలో చాలామంది తమ ఫీజులు మొత్తం చెల్లించారు. అలా చెల్లించిన వారికి కూడా తమ సర్టిఫికెట్లు ఇవ్వడం లేదని సీహెచ్.అనూష, ఎస్.నాగలక్ష్మి, ఎ.గౌరేశ్వరి, జి.సాగర్ బాబు, పి.అవినాష్ తదితరులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొద్ది రోజుల క్రితం జంగారెడ్డిగూడెం ఆర్డీవోకు ఫిర్యాదు చేయగా కళాశాల సిబ్బంది ఈ నెల 8 ఎనిమిదవ తేదీ గురువారం సర్టిఫికెట్లు ఇస్తామని చెప్పడంతో దూరప్రాంతాల నుండి గర్భిణులు, బాలింతలు తమ సర్టిఫికెట్లు కోసం వేగవరంలోని నోవా కళాశాలకు చేరుకున్నారు. అక్కడకు వచ్చిన తరువాత సిబ్బంది సరిగా సమాధానం చెప్పక పోవడం, ఫీజులు చెల్లిస్తేనే కానీ సర్టిఫికెట్లు ఇవ్వలేమని విజయవాడ యూనివర్శిటీకి వెళ్లి తెచ్చుకోండని నిర్లక్ష్యంగా సమాధానం చెప్పడంతో వారంతా కళాశాల వద్ద బైఠాయించి ఆందోళన చేపట్టారు. దాదాపు ఏడు సంవత్సరాల తరు వాత ప్రభుత్వం మెగా డీఎస్సీ ప్రకటించిందని డిఎస్సీకి దరఖాస్తు చేసుకుందామంటే సర్టిఫి కెట్లు ఇవ్వడం లేదని సమయం కూడా మే 15తో పూర్తవుతుందని పలువురు మహిళలు కన్నీటి పర్యంతమయ్యారు. కళాశాల సిబ్బంది పట్టించుకోకపోవడంతో జంగారెడ్డిగూడెం డీఎస్పీ రవిచంద్రను ఆశ్రయించారు. విద్యాశాఖామంత్రి నారా లోకేష్ ఈ విషయంపై ప్రత్యేక దృష్టి పెట్టి తమకు న్యాయం చేయాలని బాధిత పూర్వ విద్యార్థులు కోరుతున్నారు.

పదో తేదీన సర్టిఫికెట్లు ఇస్తాం

నాయుడు దుర్గాప్రసాద్, కళాశాల ఇన్‌ఛార్జి

ఈనెల పదో తేదీ శనివారం పూర్వ విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తాం. ఇంకా ఫీజులు చెల్లించవలసిన వారు తొమ్మిదో తేదీ లోగా చెల్లించాలి. ఇప్పుడు సర్టిఫికెట్ల కోసం వచ్చే వారంతా పది సంవత్సరాల క్రితం ఇక్కడ చదువు పూర్తి చేశారు. అప్పటి ప్రిన్సిపాల్స్, సిబ్బంది ఇప్పుడు పనిచేయడంలేదు. అందువల్ల కొన్ని ఇబ్బందులు ఎదురయ్యాయి. అందరికీ సర్టిఫికెట్లు అందజేస్తాం

చిన వెంకన్న కల్యాణానికి ఆహ్వానం

నేత్రపర్వం.. ధ్వజారోహణం.. సకల దేవతలకు పిలుపు

ద్వారకాతిరుమల, మే 8 (ఆంధ్రజ్యోతి): బ్రహ్మాండనాయకుని బ్రహ్మోత్సవ వేడుకల సంబరం అంబరాన్నంటుతోంది. స్వామివారి కల్యాణం తిలకించేందుకు సకల చరాచర సృష్టికి, ముక్కోటి దేవతలకు ఆహ్వానం పలుకుతూ గురువారం రాత్రి జరిగిన ధ్వజారోహణ వేడుక భక్తజనకోటికి కన్నుల పండువైంది. ఇంద్రాది అష్టదిక్పాలకులు, సర్వ దేవతలు, దేవ గణాలను స్వాగతిస్తూ వేదమంత్రోచ్ఛరణలతో అర్చకులు శ్రీవారి ఆలయ ప్రాకారంలోని ధ్వజ స్తంభంపై గరుడపటాన్ని ఎగురవేశారు. అంతకు ముందు ఉదయం ఆలయంలో విశేష కార్యక్రమాలు జరిగాయి. సాయంత్రం ఆలయంలో విష్వక్సేనుని ఒక వాహనంపై ఉంచి అలంకరించి, డోలు, సన్నాయివాయిద్యాల నడుమ అర్చకులు పుట్టమన్ను తెచ్చారు. అంతకు ముందే ఆలయ యాగశాలలో ఏర్పాటుచేసిన పాలికల్లో పుట్టమన్నును పోసి అంకురార్పణను శాస్త్రోక్తంగా జరిపారు. అనంతరం గరుడపటాన్ని వెండి తొళక్క వాహనంలో ఉంచి ఆ తరువాత ఆలయంలో ధ్వజారోహణ నిర్వహించారు. బ్రహ్మోత్సవాల్లో నేటి ఉదయం 7 గంటలకు సూర్యప్రభ వాహనంపై తిరువీధిసేవ 8-30 నుండి భజన సంకీర్తనలు. రాత్రి 7 గంటల నుంచి చంద్రప్రభ వాహనంపై గ్రామోత్సవం నిర్వహిస్తారు. గురువారం స్వామివారు మత్స్యావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు.దశావతారాల్లో మొదటి అవతారం ఇది. శంఖు, చక్ర, గదాధారియై ఉన్న చిన్న తిరుమలేశుని పలువురు భక్తులు దర్శించుకున్నారు.



ధ్వజపటానికి హారతి ఇస్తున్న అర్చకుడు

తొలి తప్పుగా వదిలేయండి!

వైద్య ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శికి అభ్యర్థన

కఠిన చర్యలేవీ తీసుకోబోమని హామీ ఇచ్చారని ‘ఏపీ-హంస’ నాయకుల వెల్లడి

ఏలూరు అర్బన్, మే 8 (ఆంధ్రజ్యోతి) : ముఖ గుర్తింపు ఆధారిత హాజరు (ఎఫ్‌ఆర్ ఎస్) నమోదులో ట్యాంపరింగ్‌కు పాల్పడ్డారనే అభియోగాలపై రాష్ట్రవ్యాప్తంగా పీహెచ్‌సీలు, ఇతర ఆసుపత్రుల్లో పనిచేస్తున్న 224 మంది వైద్యాధికారులు, ఎంఎల్ హెచ్ పీలు, ఫార్మసిస్టులు, ల్యాబ్ టెక్నీషి యన్లపై క్రమ శిక్షణ చర్యలు తీసుకునేందుకు ఇటీవల ప్రజారోగ్య, కుటుంబ సంక్షేమశాఖ డైరెక్టర్ జారీ చేసిన ఉత్తర్వుల అమలును నిలిపివేయా ల్సిందిగా అభ్యర్థిస్తూ ఏపీ హెల్త్ అడ్మినిస్ట్రేషన్ మెడికల్ సర్వీసెస్ అసోసియేషన్ (ఏపీ-హంస) రాష్ట్ర అధ్యక్షుడు అరవపాల్ గురువారం అమరావతి సెక్రటేరియట్‌లో వైద్యశాఖ ఉన్నతాధికారులను కలుసుకుని వినతిపత్రం అందజేశారు. ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో రాష్ట్రంలో వైద్యశాఖ తరఫున చేపట్టాల్సిన ముందస్తు ఏర్పాట్లపై సచివాలయంలో వైద్య ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు అధ్యక్షతన జరిగిన ఉన్నతస్థాయి సమావేశం సందర్భంగా తమ అభ్యర్థనను ఉన్నతాధికారులకు నివేదించినట్టు వివరించారు. తమ వినతిపై సానుకూలంగా స్పందించిన ముఖ్యకార్యదర్శి కృష్ణబాబు ఆయా శాఖల హెచ్‌వోడీలకు అక్కడికక్కడే మౌఖిక ఆదేశాలు జారీ చేశారని తెలిపారు. సాంకేతికలోపం వల్లే ఎఫ్‌ఆర్‌ఎస్ హాజరు నమోదులో అవాంఛనీయ పరిణామాలు చోటు చేసుకున్నాయని, ఉద్యోగులెవరూ ఉద్దేశ పూర్వకంగా ట్యాంపరింగ్ చేయలేదని కృష్ణబాబుకు వివరించామన్నారు.తొలి తప్పుగా పరిగణించి కఠిన చర్యలేవీ చేపట్టవద్దని కోరామన్నారు. ఎఫ్‌ఆర్‌ఎస్ హాజరు యాప్‌లో లోపాలను సరిదిద్దాలని, ఇకమీదట ఇలా జరుగకుండా జాగ్రత్తలు తీసుకుంటామని హామీ ఇచ్చామన్నారు. ఈ నేపథ్యంలో సమావేశంలో అక్కడేవున్న వైద్య శాఖలోని మూడు ప్రధానవిభాగాల హెచ్‌వో డీలతో మాట్లాడిన ముఖ్యకార్యదర్శి కఠిన చర్యలేవీ మెడికల్ ఆఫీసర్లు, ఉద్యోగులపై చేపట్టవద్దని మౌఖిక ఆదేశాలిచ్చారని తెలిపారు. పూర్తి స్థాయిలో లిఖితపూర్వక ఉత్తర్వులు శుక్రవారం విడుదలవుతాయని సంఘ వ్యవస్థాపకుడు కె.యోగేశ్వర రెడ్డి, జిల్లా నాయకుడు ఆనంద్ వివరించారు. కాగా ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 8మంది పీహెచ్‌సీల వైద్యాధికారులు, ఒక ఎంఎల్ హెచ్‌పీ, ఒక ల్యాబ్ టెక్నీషియన్, ఒక ఫార్మసిస్టు ఐఫోన్లను ఉపయోగించి టైం, డేట్ సెట్టింగ్‌లను సెట్టింగ్ చేసి ట్యాంపరింగ్ చేయడం ద్వారా హెల్త్ ఎఫ్‌ఆర్‌ఎస్ యాప్‌లో హాజరు నమోదుచేసినట్టు గత నెల 10న స్టేట్ నోడల్ ఆఫీసర్ గుర్తించి, వారిపై క్రమ శిక్షణ చర్యలకు ఆదేశించిన విషయం తెలిసిందే. వీరిలో జిల్లాలో ఎఫ్‌ఆర్‌ఎస్ హాజరు నమోదును డీఎంహెచ్‌వో కార్యాలయం నుంచి రోజూ పర్యవేక్షించే నోడల్ అధికారికూడా ఉండటం విశేషం.



కల్యాణోత్సవంలో పాల్గొన్న డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు,రమాదేవి దంపతులు

కనుల పండువగా కాళ్లకూరు వెంకన్న కల్యాణం

కాళ్ల, మే 8 (ఆంధ్రజ్యోతి) : కలియుగ దైవం కాళ్లకూరు వేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం గురువారం కన్నుల పండువగా జరిగింది. పెండ్లి కుమారుడు, పెండ్లి కుమార్తెల అలంకరణలో స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. ముందుగా గ్రామంలో స్వామివారికి గరుడ సేవ నిర్వహించారు. సాయంత్రం ఆలయంలో గాజువాకకు చెందిన కాందూరి వెంకట రమణాచార్యులుచే దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో వేద పండితులు, ఆలయ అర్చకులు కల్యాణోత్సవం అత్యంత వైభవంగా జరిపారు. డిప్యూటీ స్పీకర్ కనుమూరు రఘురామకృష్ణరాజు, రమాదేవి దంపతులు కల్యాణ పూజల్లో పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అమ్మవార్లకు పట్టువస్త్రాలు సమర్పించారు. ఈవో ఎం.అరుణ్‌కుమార్, ఆలయ అధికారులు, అర్చకులు, సిబ్బంది ఏర్పాట్లను పర్యవేక్షించారు.



కల్యాణం వీక్షిస్తున్న కలెక్టర్ తదితరులు



వేంకటేశ్వరస్వామికి ఎమ్మెల్యే అంజిబాబు చేతుల మీదుగా కిరీటం అందిస్తున్న దాతలు

వైభవంగా వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవాలు ప్రారంభం

భీమవరం టౌన్, మే 8 (ఆంధ్రజ్యోతి) : భీమవరం జేపీ రోడ్డులో శ్రీపద్మావతి వేంకటేశ్వరస్వామి ఆలయంలోని స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలను గురువారం ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) ప్రారంభించారు. ఆలయ ప్రాంగణంలో ఉత్సవ విగ్రహాలకు పంచామృతాలతో సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలను నిర్వహించారు. స్వామివారిని, అమ్మవారిని పెండ్లి కుమారుడు, పెండ్లి కుమార్తెగా అలంకరించారు. అనంతరం 108 కలశాలతో అభిషేకం నిర్వహించారు. అనంతరం స్వామివారికి, అమ్మవారికి చందన అలంకరణ చేశారు. 10వ తేదీ రాత్రి 7 గంటలకు స్వామివారి కల్యాణం జరుగుతుందని ఈవో ముదునూరి సత్యనారాయణ రాజు, ఛైర్మన్ మంతెన రామ్‌కుమార్ రాజు తెలిపారు కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ స్వామివారికి ముత్యాల తలంబ్రాలు, ఎమ్మెల్యే అంజిబాబు దంపతులు పట్టు వస్త్రాలను అందిస్తారని తెలిపారు.

వెండి కిరీటం అందజేత :

స్వామి వారికి దాతలు రెండున్నర కిలోల వెండి కిరీటాన్ని అందించారు. కాకులపాటి వీరరాఘవరావు దంపతులు ప్రత్యేకంగా తయారు చేయించిన వెండి కిరీటాన్ని ఎమ్మెల్యే అంజిబాబు చేతుల మీదుగా అందించారు. జనసేన పట్టణ అధ్యక్షుడు చెనమల్ల చంద్రశేఖర్, బండి రమేష్ కుమార్, వబిలిశెట్టి రామకృష్ణ, కారుమూరి సత్యనారాయణ మూర్తి, తదితరులు పాల్గొన్నారు



అమ్మవారికి దాతలు అందించిన అగ్గిపెట్టెలో చీర

ముగ్గురిపై కేసు నమోదు

ఏలూరు క్రైం, మే 8 (ఆంధ్రజ్యోతి) : ఒక యువతిని ప్రేమించి పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసగించిన యువకునితో పాటు అతని తల్లిదండ్రులపై కూడా ఏలూరు మహిళా పోలీసులు కేసు నమోదు చేశారు. జిల్లాలోని ఓ ప్రాంతానికి చెందిన యువతిని గుంటూరు జిల్లా తాడేపల్లికి చెందిన సాదు వెంకట అక్షయ్ ప్రేమించాడు. పెళ్లి చేసుకుంటానని నమ్మించి వివాహేతర సంబంధం కొనసాగించాడు. అంతేకాకుండా ఆమెను పెళ్లి చేసుకుంటానని అతని తల్లి ఇందిరరాణి, తండ్రి నరసింహుడు కలిసి సంబంధం మాట్లాడుకున్నారు. ఆ తరువాత నిరాకరించారు. దీంతో ఆ ముగ్గురిపై బాధితురాలు ఫిర్యాదు చేయడంతో మహిళా పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

పోక్సో కేసు నమోదు

భీమవరం క్రైం, మే 8 (ఆంధ్రజ్యోతి) : 6వ తరగతి చదువుతున్న బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తించిన ఒక వ్యక్తిపై పోక్సో కేసు నమోదు చేసినట్టు భీమవరం టూటౌన్ ఎస్ఐ రెహ్మాన్ తెలిపారు.పట్టణంలోని బలుసుమూడి ప్రాంతానికి చెందిన బాలిక సెలవులు కావడంతో రోడ్డుపై ఆడుకుంటున్నది. అయితే ఆ ఇంటి పక్కనే ఉన్న 55 ఏళ్ల వ్యక్తి ఆ బాలికను మాయ మాటలు చెప్పి ఇంట్లోకి తీసుకువెళ్లి లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఈ విషయాన్ని తల్లిదండ్రులకు చెప్పడంతో వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అప్పుల బాధతో ఆత్మహత్య

పెదవేగి, మే 8(ఆంధ్రజ్యోతి) : అప్పులబాధ తట్టుకోలేక ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడినట్టు పెదవేగి ఎస్ఐ కె.రామకృష్ణ తెలిపారు. పెదకడిమి గ్రామానికి చెందిన నెర్సు రాటాలు సాగులో నష్టం వచ్చి, అప్పులపాలయ్యాడు. చేసిన అప్పులు తీర్చలేనేమోననే ఆందోళనతో మంగళవారం పురుగుమందు తాగాడు. తీవ్ర అస్వస్థతకు గురైన అతనిని ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ రాటాలు (40) బుధవారం రాత్రి మృతి చెందాడు. మృతుని తండ్రి జమలయ్య ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

పంచాయతీ ఉద్యోగిపై దాడి

ఉండి, మే8(ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఉద్యోగిపై దాడి చేసి గాయపరిచిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఉండి పోలీసులు తెలిపారు. పాందువ్వ గ్రామపంచాయతీలో ట్యాంక్ వాచర్‌గా పనిచేస్తున్న హనుమంతు కృష్ణారావును ఈనెల 7వ తేదీ మధ్యాహ్నం అదే గ్రామానికి చెందిన అరవెల్లి నరసన్న అనే వ్యక్తి ఇంటివన్ను విషయంలో ఘర్షణపడి దాడి చేసి గాయపరిచినట్లు గురువారం పోలీసులకు బాధితుడు ఫిర్యాదు చేశారు. దీనిపై కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్న ఉండి ఎస్ఐ నజీరుల్లా తెలిపారు.

శాంతి భద్రతల పరిరక్షణే ప్రథమ కర్తవ్యం

వార్షిక తనిఖీలో ఏలూరు రేంజ్ ఐజీ అశోక్‌కుమార్

భీమవరం క్రైం, మే 8 (ఆంధ్రజ్యోతి) :జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణ, నేరాల నివారణే లక్ష్యంగా జిల్లాలోని ప్రతి ఒక్క పోలీసు అధికారి, సిబ్బంది విధులు నిర్వర్తించాలని ఏలూరు రేంజ్ ఐజి జీవీజీ అశోక్‌కుమార్ ఆదేశించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా గురువారం భీమవరంలో జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయానికి విచ్చేసిన ఆయనకు జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి, ఇతర పోలీసు అధికారులు సాదర స్వాగతం పలికారు. అనంతరం ఐజీ సాయుధ బలగాల గౌరవ వందనం స్వీకరించి కార్యాలయ పరిసరాలను పరిశీలించారు. తర్వాత కార్యాలయ ప్రాంగణంలో గల డిస్ట్రిక్ట్ క్రైం రికార్డ్ బ్యూరో (డీసీఆర్‌బీ), డిస్ట్రిక్ట్ స్పెషల్ బ్రాంచ్, ఫింగర్ ప్రింట్, ఆర్మ్‌డ్ రిజర్వ్, జిల్లా పోలీసు కార్యాలయ వివిధ పరిపాలన విభాగాలలో వార్షిక ప్రగతి నివేదికలను క్షుణ్ణంగా పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. పోలీసు అధికారులతో జిల్లాలో శాంతి భద్రతలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లాలో కీలకమైన పెండింగ్ కేసులు, పాత నేరస్తులు, సస్పెక్ట్ షీట్స్ తదితర అంశాలపై వివరాలను అడిగి తెలుసుకున్నారు. జిల్లా అదనపు ఎస్పీ వి.భీమారావు, భీమవరం డీఎస్పీ ఆర్.జయసూర్య, నరసాపురం డీఎస్పీ జి.శ్రీవేద, తాడేపల్లిగూడెం సబ్ డివిజన్ డీఎస్పీ డి.విశ్వనాథ్, ట్రైనీ డీఎస్పీ కె.మానస పాల్గొన్నారు. ఏలూరులోని పెద్ద రైల్వేస్టేషన్‌లో ముందస్తు భద్రతా చర్యల్లో భాగంగా తనిఖీలు చేసినట్టు ఐజీ తెలిపారు. తనిఖీల్లో ఎస్పీ కిశోర్, డీఎస్పీ శ్రావణ్‌కుమార్‌లు పాల్గొన్నారు



పోలీసు అధికారులతో సమీక్షిస్తున్న ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్‌కుమార్

35 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం స్వాధీనం

ఏలూరు క్రైం/పెనుగొండ, మే 8 (ఆంధ్రజ్యోతి) : ప్రజా పంపిణీకి సంబంధించిన బియ్యాన్ని అక్రమ మార్గంలో తరలిస్తుండగా విజిలెన్సు అధికారులు తనిఖీలు చేసి 35 క్వింటాళ్ల బియ్యం, వ్యాన్‌ను స్వాధీనం చేసుకుని ముగ్గురిపై కేసు నమోదు చేశారు. విజిలెన్సు సీఐ పి.శివరామకృష్ణ, పెనుగొండ సివిల్ సప్లై రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, రెవెన్యూ అధికారులు కలిసి పెనుగొండ మండలం సిద్ధాంతం జంక్షన్ వద్ద గురువారం వాహనాల తనిఖీలు చేపట్టారు. అశోక్ లేలాండ్ వాహనాన్ని ఆపి తనిఖీ చేయగా ఆ వ్యానులో 35 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. అలాగే వ్యాన్‌ను కూడా సీజ్ చేసినట్లుగా తెలిపారు. వాహన యజమాని, డ్రైవర్ అయిన కొర్లేపర మణికంఠను ప్రశ్నించగా అతను ఆ బియ్యం తణుకు పరిసర ప్రాంతాల్లో తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్న ఎన్‌వి రామకృష్ణ వద్ద కొనుగోలు చేసి వాటిని అధిక ధరకు నర్సిపూడికి చెందిన ఉండమట్ల మణికంఠకు అమ్ముతున్నట్లుగా తెలిపారు. ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లుగా విజిలెన్సు అధికారులు తెలిపారు.

ముగ్గురిపై కేసు



బియ్యం వ్యాన్‌ను పట్టుకున్న అధికారులు

ఇద్దరు సైబర్ నేరస్థుల అరెస్టు

నరసాపురం టౌన్, మే 8(ఆంధ్రజ్యోతి): సైబర్ క్రైం కేసులో అంతర్ రాష్ట్ర ముఠాలోని ఇద్దరిని అరెస్టు చేసినట్లు సీఐ యాదగిరి చెప్పారు. గురువారం సీఐ కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ గత ఏడాది నవంబర్ నెలలో పట్టణానికి చెందిన మెడికల్ షాపు నిర్వాహకుడు స్టాక్ మార్కెట్ కోసం గుగూల్‌లో వెతికాడన్నారు. గుగూల్ ఓపెన్ చేయగానే గుర్తు తెలియని వాట్సప్ నుంచి ఆన్‌లైన్ ట్రేడింగ్ చేయాలంటే తాను చెప్పిన గ్రూప్‌లో చేరాలని నమ్మ బలికాడన్నారు. ఈ గ్రూప్‌లో చేరిన బాధితుడు పలు దఫాలుగా సుమారు రూ.54లక్షలు డిపాజిట్ చేసినట్లు సీఐ చెప్పారు. పెట్టుబడి పెట్టిన సొమ్ము తిరిగి రావాలంటే రూ. 1.67కోట్లు కట్టాలని నేరగాళ్లు బాధితుడికి చెప్పారన్నారు. దీంతో బాధితుడు మోస పోయినట్లు గ్రహించి గత ఏడాది నవంబర్ 11న పోలీసులకు ఫిర్యాదు చేశాడన్నారు. దర్యాప్తు చేపట్టిన సీఐ ఈనెల 5న వెస్ట్ బెంగాల్ కోల్‌కతాకు చెందిన సైబర్ నేరగాళ్లు దీపక్‌కుమార్, జె రాజేష్‌లను అరెస్టు చేసి కోల్‌కతా కోర్టులో హాజరుపర్చి నరసాపురం తీసుకొచ్చామ న్నారు. కేసును ఛేదించేందుకు కానిస్టేబుల్ ఎస్ చక్రవర్తి, ఈ.అబ్బాస్‌లను టీమ్‌లుగా ఏర్పాటు చేశామన్నారు. ఈకేసులో మిగిలిన నిందితులను త్వరలో పట్టుకుంటామని చెప్పారు. ఈసమావేశంలో ఎస్సై జయలక్ష్మి, సిబ్బంది వెంకట్, నరేంద్రగౌడ్ పాల్గొన్నారు.



నిందితులను అరెస్టు చేసి విలేకరులకు వివరాలు వెల్లడిస్తున్న సీఐ యాదగిరి

మద్యానికి బానిసై ఒకరి ఆత్మహత్య

భీమడోలు, మే 8 (ఆంధ్రజ్యోతి) : మద్యానికి బానిసై ఒక వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. భీమడోలు పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. భీమడోలు మండలం పోలసానపల్లి గ్రామానికి చెందిన కోటా రాము (45)కు వివాహం అయింది. ఇద్దరు పిల్లలు. కూలి పని చేస్తూ మద్యానికి బానిసై పనికి వెళ్లకుండా వెసనపరుడుగా మారాడు. దీనిపై ఈనెల 8వ తేదీన భార్య మందలించిందని రేకుల షెడ్డుకు చీరతో ఉరి వేసుకుని మృతి చెందాడు. బంధువులు చూసి ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే చనిపోయినట్లు వైద్యులు నిర్ధారించారు. భీమడోలు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పెళ్లి పేరుతో నమ్మించి డాక్టర్‌కే అబార్షన్

ఏలూరు క్రైం, మే 8 (ఆంధ్రజ్యోతి) : ప్రేమించి పెళ్ళిచేసుకుంటానని అబార్షన్లు చేయించి ఆపై పెళ్ళికి నిరాకరించి మరో యువతిని పెళ్ళిచేసుకోవడానికి పీటలపై కూర్చోడానికి సిద్ధపడిన ఒక డాక్టర్‌ను ఏలూరు మహిళా పోలీస్ స్టేషన్ సీఐ ఎం.సుబ్బారావు గురువారం అరెస్టు చేశారు. ఒక ప్రైవేటు మెడికల్ కళాశాలలో ఒక యువతి డాక్టర్ చదివింది. ఈనెల 4వ తేదీన పరీక్షలు పూర్తి చేసుకుంది. ఆమెతోపాటే పల్నాడు జిల్లా రాజుపాలెం మండలం శ్రీనివాసనగర్‌కు చెందిన భవనం రమణారెడ్డి రేడియాలజీ చదివారు. వారిద్దరూ క్లాస్ మేట్స్ కావడంతో ప్రేమించుకున్నారు. పెళ్లి చేసుకుంటానని ఆ యువతిని నమ్మించి వివాహేతర సంబంధం కొనసాగించారు. అబార్షన్లు కూడా చేయించారు. పెళ్లికి నిరాకరించి మరో యువతిని ఈనెల 11వ తేదీన పెళ్లి చేసు కోవడానికి సిద్ధపడ్డాడు. దీంతో బాధితురాలు ఏలూరులోని మహిళా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో సీఐ సుబ్బారావు కేసు నమోదు చేసి యువతిని మోసగించిన డాక్టర్ భవనం రమణారెడ్డిని గురువారం అరెస్టు చేశారు.

ఏలూరులో ముమ్మరంగా వాహనాల తనిఖీలు

ఏలూరు క్రైం, మే 8(ఆంధ్రజ్యోతి) : శాంతిభద్రతల పరిరక్షణ దృష్ట్యా జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో గురువారం రాత్రి నాకా బందీ నిర్వహించారు. ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. అనుమానాస్పదంగా ఉన్న వ్యక్తులను ప్రశ్నించి వారి వివరాలడిగి తెలుసుకున్నారు. ఏలూరు పెద్ద రైల్వే స్టేషన్‌లోనూ పోలీసులు తనిఖీలు చేశారు. ప్రయాణికులు ఎక్కడి నుంచి ఎక్కడికి వెళ్తున్నారో అడిగి లగేజీని క్షుణ్ణంగా పరిశీలించారు. పాకిస్థాన్, భారత్ మధ్య జరుగుతున్న దాడుల నేపథ్యంలో ముందస్తుగా ఈ తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలుస్తోంది.

ఎమ్మెల్యే రోషన్ కుమార్ సుడిగాలి పర్యటన

జంగారెడ్డిగూడెం, మే 8(ఆంధ్రజ్యోతి) : ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ గురువారం పట్టణంలో సుడిగాలి పర్యటన నిర్వహించారు. సూర్య కళాశాల సమీపంలో ఏర్పాటు చేసిన వాలీ బాల్ టోర్నమెంట్‌ను, మున్సిపల్ కార్యాలయం వద్ద మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అర్బన్ మార్కెట్‌ను, మహిళలు ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను ప్రారంభించి పరిశీలించారు. పట్టణంలో వెయ్యి మహిళా సంఘాలతో పదివేల మంది మహిళలు చిరు వ్యాపారాలు ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమాల్లో మున్సిపల్ ఛైర్ పర్సన్ బత్తిన నాగలక్ష్మి ఉన్నారు.

గృహ సారథులను నియమించండి : బొరగం

బుట్టాయగూడెం, మే 8(ఆంధ్రజ్యోతి): పార్టీ అధిష్ఠానం ఆదేశాల మేరకు క్షేత్రస్థాయి నుంచి పార్టీని బలోపేతం చేయడానికి గృహ సారథుల నియామకాలను వెంటనే పూర్తి చేయాలని ఏపీ ట్రైకార్ ఛైర్మన్ బొరగం శ్రీనివాసులు నాయకులకు స్పష్టం చేశారు. గురువారం బుట్టాయగూడెం క్యాంపు కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలతో జరిగిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ విజయం సాధించాలంటే 60 ఇళ్లకు ఒక గృహ సారథిని నియమించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు పఠాన్ రసూల్ ఖాన్, పసుమర్తి భీమేశ్వరావు, బాడిస ముత్యాలరావు, మొడియం సింగరాజు, చోడెం అర్జున్, కప్పల నాగేశ్వరావు, యుకెడి బాబు, మనెల్లి బాలు, కె.పద్మరాజు, మనోజ్, అరుణకుమార్ పాల్గొన్నారు.

విద్యార్థులకు ఎమ్మెల్యే బాలరాజు అభినందన



ప్రశంసా పత్రాలతో విద్యార్థినులు

కుక్కునూరు, మే 8(ఆంధ్రజ్యోతి) : ఏపీ గిరిజన సంక్షేమ గురుకుల బాలికల బుట్టాయగూడెంలో విద్యనభ్యసించి ప్రతిభ కనపరిచిన కుక్కునూరు మండలానికి చెందిన ముగ్గురు బాలికలను పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు అభినందించారు. నిమ్మల స్వాతి, నేతకాని సంధ్య, జె.నందిత గురుకుల పాఠశాలలో చదివి ఇంటర్‌లో 900లకు పైగా మార్కులు సాధించారు. ఇటీవల వారిని ట్రైబల్ వెల్ఫేర్, సోషల్ వెల్ఫేర్ సంయుక్తంగా నిర్వహించిన కార్యక్రమంలో సన్మానించారు. గురువారం ఎమ్మెల్యే బాలరాజు వీరిని అభినందించారు. భవిష్యత్తులో ప్రతిభను మరింత మెరుగుపర్చుకోవాలని సూచించారు.

డీఎస్సీ కాంట్రాక్టు ఎస్జీటీల రెన్యువల్

ఏలూరు అర్బన్, మే 8(ఆంధ్రజ్యోతి) : కాంట్రాక్టు ప్రాతిపదికన కనీస వేతనస్కేలు(ఎంటీఎస్)పై ఎస్జీటీలుగా పనిచేస్తున్న డీఎస్సీ-1998, డీఎస్సీ-2008 ఉపాధ్యాయుల ఉద్యోగాలను వచ్చే విద్యాసంవత్సరానికి రెన్యువల్‌చేస్తూ ప్రభుత్వ కార్యదర్శి కోన శశిధర్ గురువారం ఉత్తర్వులు జారీచేశారని డెమొక్రటిక్ పీఆర్టీయూ రాష్ట్ర ప్రధానకార్యదర్శి పి.వెంకటేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. 'నో వర్క్-నో పే' నిబంధనమేరకు నియమితులైన వీరి సర్వీసులను ఈ ఏడాది జూన్ 1వ తేదీనుంచి వచ్చే ఏడాది ఏప్రిల్ 30వ తేదీవరకు 11 నెలలకాలానికి వినియోగించుకుంటారని వివరించారు.

రూ.50 లక్షలతో నూతన గ్రంథాలయం నిర్మిస్తాం

ఏలూరుటూటౌన్, మే 8(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్ర గ్రంథాలయానికి ఎంపీ నిధులు రూ.50 లక్షలు కేటాయిస్తున్నట్టు ఎంపీ పుట్టా మహేశ్ కుమార్ తెలిపారు. జిల్లా కేంద్ర గ్రంథాలయాన్ని పరిశీలించిన అనంతరం ఎంపీ మహేశ్ మాట్లాడుతూ శిథిలావస్థకు చేరిన భవనం స్థానంలో నూతన భవనం నిర్మిస్తామన్నారు. అంత వరకు పాత భవనానికి మరమ్మతులు చేయాలని అధికారులను ఆదేశించారు. పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఎంతో మంది విద్యార్థులు గ్రంథాలయంలో చదువుకుని ఉన్నత స్థాయికి ఎదిగారని, అలాంటి గ్రంథాలయాన్ని నిర్మించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు.

కొయ్యలగూడెంలో కుంగిపోయిన ప్రధాన రోడ్డు



కొయ్యలగూడెం, మే 8(ఆంధ్రజ్యోతి) : స్థానిక ప్రధాన సెంటర్ నుంచి పోలవరం వెళ్లే రహదారి వద్ద డ్రైన్ కుంగడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. రెండేళ్ల క్రితం తల్లాడ, దేవరపల్లి రోడ్డు నిర్మాణ పనులు జరిగాయి. అప్పట్లో పోలవరం వెళ్లే రహదారికి జాతీయ రహదారికి మధ్య డ్రెయిన్ నిర్మించారు. పోలవరం వైపునకు నిత్యం భారీ వాహనాలు వెళ్లడంతో ఆ డ్రైన్ గురువారం ఉదయం కుంగింది. దీంతో పోలవరం వైపుకు వెళ్లే పెద్దపెద్ద వాహనాలకు అంతరాయం ఏర్పడింది. ఆర్‌అండ్‌బీ అధికారులు తక్షణం స్పందించి ఈ డ్రైన్ నిర్మాణ పనులు చేపట్టాలని ఆ ప్రాంతంలో కల్వర్టు నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

ఇరువర్గాల మధ్య ఘర్షణ.. కేసులు నమోదు

జంగారెడ్డిగూడెం, మే 8(ఆంధ్రజ్యోతి) : పట్టణంలో పరస్పర దాడుల నేపథ్యంలో పోలీసులు ఇరువర్గాలపై కేసులు నమోదు చేశారు. మండలంలోని పంగిడిగూడెం గ్రామానికి చెందిన గంజి వినోద్ కుమార్ వర్గం, మొల్లా సురేష్ బాబు వర్గాలపై కేసులు నమోదు చేసినట్టు ఎస్.ఐ. ఎస్.కె.జబీర్ తెలిపారు. జంగారెడ్డిగూడెం పట్టణంలో డ్రై ఫ్రూట్స్ దుకాణం నడుపుతున్న వినోద్ కు మార్ ఈ నెల 2న తన షాపు వద్ద మద్యం తాగవద్దన్నందుకు మొల్లా సురేష్ బాబు కక్ష పెంచుకుని దాడికి పాల్పడ్డాడు.. తనపై దాడి చేసినందుకు ప్రతిగా అదే రోజు అశ్వా రావుపేట రోడ్డులో మొల్లా సురేష్‌పై వినోద్ కుమార్ వర్గం దాడికి పాల్పడింది. దీంతో వీరిరువురితో పాటు ఈ దాడిలో పాల్గొన్న 8 మందిపై కేసులు నమోదు చేసినట్టు స్.ఐ. ఎస్.కె.జబీర్ తెలిపారు.

జగన్నాథపురం గ్రామ కమిటీని ప్రకటించిన ఎమ్మెల్యే

పెదవేగి, మే 8(ఆంధ్రజ్యోతి) : పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి, సంక్షేమానికి టీడీపీ కట్టుబడి ఉన్నామని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. జగన్నాథపురంలో గురువారం రాత్రి ఏర్పాటు చేసిన సమావేశంలో పార్టీ గ్రామ కమిటీని ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీ అభివృద్ధితోపాటు ప్రజల సంక్షేమానికి కృషి చేసేలా పార్టీ గ్రామ కమిటీలను ఏర్పాటు చేస్తోందన్నారు. పార్టీ అభివృద్ధిలో గ్రామ కమిటీలదే కీలకపాత్ర అని, ప్రతి కార్యకర్త పార్టీకోసం తమవంతు బాధ్యతను నిర్వర్తించాలన్నారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు బొప్పన సుధాకర్, క్లస్టర్ ఇన్‌చార్జ్ మంచినేని శ్రీనివాసరావు, చిలకలపూడి రమేష్, కమ్మ నానాజీ, కిశోర్ పాల్గొన్నారు.

విద్యలో ఉన్నతంగా రాణించాలి : ఎస్పీ



విద్యార్థులను అభినందిస్తున్న ఎస్పీ

ఏలూరు క్రైం, మే 8 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు చదువులో రాణిస్తే జీవితంలో మంచి స్థాయికి చేరవచ్చని 20 ఏళ్ల పాటు కష్టపడి చదివితే 80 ఏళ్ల సుఖసంతోషాలతో గడిపే అవకాశం ఉంటుందని ఎస్పీ కేపీఎస్ కిశోర్ అన్నారు. ఏలూరు అమీనాపేటలో ఉన్న శ్రీసురేష్ చంద్ర బహుగుణ ఇంగ్లీషు మీడియం స్కూల్లో పదవ తరగతి పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన అంకెం ఈశ్వరి లక్ష్మి (572), ఇనంపూడి బాలసాగర్ (562), పామర్తి నవ్య (562), షేక్ యూసఫ్ యోహానా (551) లను ఎస్పీ సత్కరించి మెమెంటోలను అందించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి తల్లి దండ్రులు ఆశయ సాధనకు శ్రమించాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎన్ సూర్యచంద్రరావు, స్కూల్ ప్రిన్సిపాల్ శ్రవంతి, ఆర్ఎస్ఐ నరేంద్ర, వైస్ ప్రిన్సిపాల్ వర ప్రసాద్ సాయిరామ్, విద్యార్థులు పాల్గొన్నారు.

దెందులూరు అభివృద్ధికి సమన్వయంతో పనిచేయాలి

(ఐదో పేజీ తరువాయి)

సిద్ధంగా ఉన్నారన్నారు. నాలుగు మండలాల్లో 5వేల ఎకరాల చొప్పున డెమో ప్లాంట్లు వేసేందుకు భూమి ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. ఈ దిశగా ఒక మోడల్‌గా ప్రకృతి వ్యవసాయాన్ని దెందులూరు నియోజకవర్గంలో తీసుకురావాలన్నారు. పెదవేగి మండలంలో దుగ్గిరాల, వంగూరు దొండపాడు, పినకడిమి, జానంపేట గ్రామాల్లో 23 ఎకరాల ఇరిగేషన్ స్థలం ఖాళీగా ఉందని, దీనికి ఎన్‌వోసీ ఇస్తే సీసీఎల్‌కు ప్రతిపాద నలు పంపి ఇళ్ల స్థలాలకు అవసరమైన భూమిని సమకూర్చే అవకాశం ఉందన్నారు. శ్మశాన వాటికలకు దారులు లేని వాటిని గుర్తించాలని, గుండుగొలను నుంచి ఏలూరుకు గోదావరి కాల్వ చివరి వరకు పూడికలు తీసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్ రోడ్లపై ఆక్రమణలు తొలగించాలని, పెదపాడు సబ్‌స్టేషన్ పనులు పూర్తి చేయాలని, రొయ్యలు, చేపల చెరువుల విద్యుత్ బిల్లు విషయంలో ఇబ్బంది పెట్టకుండా చూడాలని కోరారు. కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ జిల్లాలో వ్యవసాయ, ఉద్యాన శాఖల ద్వారా అమల వుతున్న ఆయా పథకాల వివరాలను ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకురావాలని ఆదేశించారు. జిల్లాలో జనుము, జీలుగ, గ్రీన్ మెన్యూర్ సంబంధించి 10 వేల మెట్రిక్ టన్నులు కేటాయించగా, ఇప్పటికే 4వేల మెట్రిక్ టన్నులు జిల్లాకు అందాయన్నారు. ఆయిల్ పామ్ పంట విస్తీర్ణం పెంచేందుకు రైతుల్లో అవగాహన కల్పిస్తామన్నారు. జేసీ ధాత్రిరెడ్డి, డీఆర్వో విశ్వేశ్వరరావు, అధికారులు పాల్గొన్నారు.

వసతులు కల్పించండి ప్లీజ్..

అధ్వానంగా పోలవరం బస్ షెల్టర్



బస్ షెల్టర్ ఎదుట నిల్చుని ఉన్న మహిళలు



వాటర్ ట్యాంకు, కూలర్ పరిస్థితి

పోలవరం, మే 8(ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన పోలవరం బస్ షెల్టర్‌లో కనీస వసతులు, శుభ్రత లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పోలవరంలో బస్ కాంప్లెక్స్ ఉన్నా.. ఊరికి శివారున ఉండటంతో ప్రయాణికులు ఏటిగట్టు సెంటర్‌లో ఉన్న బస్ షెల్టర్‌లో బస్సుల కోసం వేచి చూస్తున్నారు. మంచి నీటి అవసరాలకు ఒక దాత ఏర్పాటు చేసిన కూలర్ మ ర మ్మతులకు గురైంది. నిర్వహణా లోపం వల్ల కూలర్, వాటర్ ట్యాంకు అపరిశుభ్రంగా ఉంటోంది. సరఫరా అవుతున్న నీరు మురికిగా ఉండటంతో బయట పాన్ షాపుల్లో వాటర్ బాటిళ్లు, వాటర్ ప్యాకెట్లు కొనుగోలు చేయాల్సిన పరిస్థితులు నెలకొన్నాయని ప్రయాణికులు వాపోతున్నారు. బస్ షెల్టర్‌లో ఫ్యాన్లు లేకపోవడంతో ఉక్కబోతతో ప్రయాణికులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఈ బస్ షెల్టర్‌లో కనీసం కూర్చోవడానికి సిమెంటు బల్లలు కూడా సరిగా లేవు.. బిచ్చగాళ్లతో అపరిశుభ్రంగా తయారయ్యాయి. పారిశుధ్యం లోపించడంతో బస్ షెల్టర్‌లో కూర్చోవడానికి ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. గత మూడు నెలల క్రితం నిర్మాణాన్ని ప్రారంభించిన మరుగు దొడ్లు అసంపూర్తిగా మిగిలిపోవడంతో మహిళలు, విద్యార్థినులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాత్రి సమయాల్లో బస్ షెల్టర్‌లో లైట్లు కూడా లేకపోవడంతో ప్రయాణికులు భయాందోళనకు గురవుతున్నారని స్థానికులు చెబుతున్నారు. అధికారులు స్పందించి బస్ షెల్టర్‌లో వసతులు కల్పించాలని సమస్యలు పూర్తి స్థాయిలో పరిష్కరించాలని, వాటర్ కూలర్ మరమ్మతులు చేయించి, శుభ్రం చేయించి మంచినీటి సరఫరా చేయాలని, ఫ్యాన్లు లైట్లు ఏర్పాటు గ్రామస్థులు కోరుతున్నారు.

కలెక్టరేట్ ఎదుట ఆందోళనలు



కలెక్టరేట్ ఆవరణలో ధర్నా చేస్తున్న ఐక్యరైతు సంఘం, పీడీఎస్‌యూ, పీవైఎల్ నాయకులు



ధర్నా చేస్తున్న ఎంఆర్పీఎస్ నాయకులు

ఏలూరు రూరల్, మే 8(ఆంధ్రజ్యోతి) : సీహెచ్‌వోలను క్రమబద్ధీకరించాలని ఏలూరు జిల్లా ఏపీఎంసీఏ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు చేపట్టిన నిరసన గురువారం 10వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ రెండేళ్లుగా జీతభత్యాలపై వినతిపత్రాలిస్తున్నా సమస్య పరిష్కరించడం లేదని సీహెచ్‌ఏలు ఆవేదన వ్యక్తం చేశారు. ఆయుష్మాన్ భారత్ నిబంధనల ప్రకారం తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని, నేషనల్ హెల్త్ మిషన్ ఉద్యోగులతో సమానంగా 23శాతం వేతన సవరణ జరగాలని, పని ఆధారిత ప్రోత్సహకాలను క్రమబద్ధీకరించాలని, నిలుపుదల చేసిన పీఎఫ్‌ను పునరుద్ధరించాలని, క్లినిక్ అద్దె బకాయిలను వెంటనే చెల్లించాలని కోరారు. జిల్లా కార్యదర్శి సురేంద్ర, చాందిని, విమల పాల్గొన్నారు.

కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని..

భీమడోలు పంచాయతీ కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఎంఆర్పీఎస్ ఆధ్వర్యంలో గురువారం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు కందుల రమేశ్ మాట్లాడుతూ భీమడోలు గ్రామానికి చెందిన కొత్తపల్లి చంద్రమౌళి ఇటీవల ఆ గ్రామ పంచాయతీలో లక్షలాది రూపాయల నిధులు పక్కదారి పట్టడంతో సోమవారం కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశామన్నారు. ఈక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఫిర్యాదుదారుడైన కొత్తపల్లి చంద్రమౌళి ఇంటికి వచ్చి దౌర్జన్యం చేసి కుటుంబ సభ్యులను భయభ్రాంతులను గురి చేశారని ఆరోపించారు. ఎటువంటి నోటీసులివ్వకుండా ప్రహరీని కూల్చివేయడం దుర్మార్గమన్నారు. అనంతరం అధికారులను కలిసి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు బయ్యారపు కుటుంబరావు, కొత్తపల్లి మురళికాశీకృష్ణ, ఏలియా యేసురాజు, సాయిబాబు పాల్గొన్నారు.

మద్దతు ధరలు చెల్లించాలంటూ..

పంటలకు మద్దతు ధరను చట్టబద్ధం చేయాలని డిమాండ్ చేస్తూ అఖిల భారత ఐక్య రైతు సంఘం జాతీయ కమిటీ పిలుపు మేరకు అఖిల భారత ఐక్య రైతు సంఘం ఆధ్వర్యంలో గురువారం ఏపీ రాష్ట్ర కన్వీనింగ్ కమిటీ కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కన్వీనర్ ఎస్కే గౌస్ మాట్లాడుతూ రైతుకు కష్టకాలం వచ్చిందని వ్యవసాయ రంగం ప్రమాదకర పరిస్థితుల్లో ఉందన్నారు. మిర్చి, పొగాకు, పత్తి రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారని వ్యవసాయం పండుగ నుంచి దండగగా మారి, పల్లెలను వదిలి పట్టణాలకు బ్రతుకు తెరువు కొరకు వలసలు వెళ్లాల్సిన పరిస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఆందోళన కార్యక్రమాల్లో నాయకులు జి.ముత్యాలరావు, ఎస్.చంద్రరావు, కె.కల్లయ్య, పి.వీరబాబు, ఎం మల్లేశ్, నార్లవరం ఎంపీటీసీ కె.రత్తమ్మ, తిరుమలపురం సర్పంచ్ ఎస్.విజయ, ఎం.మంగరాజు పాల్గొన్నారు.

విద్యార్థులకు వేసవిలో వినోదం, విజ్ఞానం



వేసవి శిక్షణ కార్యక్రమానికి హాజరైన చిన్నారులు

దెందులూరు, మే 8(ఆంధ్రజ్యోతి) : వేసవి కాలంలో విద్యార్థులకు గ్రంథాలయాల్లో వినోదంతో పాటు విజ్ఞానాన్ని పెంపొందించేలా శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నామని పోతునూరు గ్రంథాలయ పాలకుడు గురిందపల్లి రాంబాబు అన్నారు. తమ గ్రంథాలయంలో 20 మంది విద్యార్థులకు పది రోజులుగా శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. గ్రంథాలయంలో పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలపై అవగహన కల్పించారు. అనంతరం విద్యార్థులకు అల్పాహారం అందించారు.

● లింగపాలెం : విద్యార్థులు గ్రంథాలయాలకు ప్రతి రోజూ పుస్తక పఠనాన్ని అలవర్చుకోవాలని గ్రంథాలయాధికారులు సి.హెచ్.వెంకట రమణ,లతీఫ్ అన్నారు. మండలంలోని లింగపాలెం, దర్మాజీగూడెం గ్రంథాలయాల్లో వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా రిసోర్స్ పర్సన్స్ కె. తేజస్విని పాల్గొని హాజరైన విద్యార్థులకు మ్యాథ్స్, ఇంగ్లీష్, హిందీ సబ్జెక్టులపై అవగాహన కల్పించారు.

● పెదవేగి : ఆట పాటలతో కూడిన విద్య విద్యార్థి భవిష్యత్తుకు ఎంతగానో దోహదపడుతుందని పెదవేగి శాఖా గ్రంథాలయం గ్రంథపాలకుడు తోట అరుణ్ కుమార్ అన్నారు. పెదవేగిలోని శాఖా గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా గురువారం ఆటపాటలతో కూడిన శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా అరుణ్ కుమార్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి చదువుతో పాటు ఆటపాటల్లో ప్రావీణ్యాన్ని పొందాలని ఆయన సూచించారు.

● ఏలూరు రూరల్ : ఏలూరులో హనుమాన్ కర్రసాము గ్రూప్ సభ్యుల చేత వేసవి సెలవులను పురస్కరించుకొని సూర్య నమస్కారాలు, కర్రసాములో 35 రోజుల పాటు ఉచిత శిక్షణ శిబిరం కొనసాగుతోంది. ఈ కర్రసాము శిబిరాన్ని ఏపీఎస్ఆర్టీసీ జోనల్ ఛైర్మన్ రెడ్డి అప్పలనాయుడు గురువారం సందర్శించారు.ఈ మేరకు ఆయన మాట్లాడుతూ 35 రోజుల పాటు ఔత్సాహికంగా ఉన్న చిన్నారులకు, పిల్లలకు ఉచితంగా కర్రసాములో శిక్షణనివ్వడం అభినందనీయమన్నారు.



నారాయణపురంలో విగ్రహ ప్రతిష్ఠకు హాజరైన నాయకులు



విగ్రహ ప్రతిష్ఠలో పాల్గొన్న ఎమ్మెల్యే చింతమనేని

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు

ఉంగుటూరు,మే 8(ఆంధ్రజ్యోతి) : నారాయణపురంలో లక్ష్మీనారాయణ ఫౌండేషన్, ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు ఆధ్వర్యంలో నాలుగు రోజుల పాటు లక్ష్మీనారాయణ, శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామి అమ్మవార్ల విగ్రహాల ప్రతిష్ఠ భక్తి శ్రద్ధలతోను వైభవంగా నిర్వహించారు. గురువారం విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో ఏలూరు ఎంపీ పుట్టా మహేశ్ కుమార్ యాదవ్‌తో పాటు, దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకరరావు, టీడీపీ జిల్లా అధ్యక్షులు గన్ని వీరాంజనేయులుతో ఉంగుటూరు అసెంబ్లీ కన్వీనర్ శరణాల మాలతీరాణి పాటు పలువురు ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు. అనంతరం భారీ అన్న సమారాధన నిర్వహించారు. అలాగే వచ్చిన భక్తులకు తీర్థ ప్రసాదాలతో పాటు మొక్కలను కానుకగా అందించారు.

నూతనగూడెంలో..

పోలవరం : నూతనగూడెంలో నిర్మించిన శ్రీ దత్త వేంకటేశ్వరస్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాన్ని గురువారం ఆలయ నిర్వాహకులు పేపకాయల వెంకన్న బాబు దంపతులు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చక వేద పండితులు ర్యాలి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో గణపతి హోమం ఇతర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భారీ అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పోలవరం మండల కేంద్రం పరిసర ప్రాంతాల భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు.

శ్రీపర్రులో..

ఏలూరు రూరల్ : శ్రీపర్రు గ్రామంలో శ్రీవిఘ్నేశ్వరస్వామి ఆలయంలో గురువారం ఉదయం అత్యంత వైభవంగా గణపతి విగ్రహప్రతిష్ఠ మహోత్సవం జరిగింది. ఉదయం ప్రత్యేక పూజలు హోమాల అనంతరం విగ్రహ ప్రతిష్ఠను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఏలూరు ఎంపీ పుట్టా మహేశ్ కుమార్, దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమానంతరం వారికి వేద పండితులు వేద ఆశీర్వచనాలతో పాటు తీర్థప్రసాదాలు అందించారు.



చలివేంద్రం ప్రారంభిస్తున్న డీఎస్పీ వెంకటేశ్వరరావు

పోలవరంలో చలివేంద్రం ప్రారంభం

పోలవరం, మే 8(ఆంధ్రజ్యోతి) : స్థానిక అంబేడ్కర్ సెంటర్‌లో పోలవరం డీఎస్పీ ఎం.వెంకటేశ్వరరావు, సీఐ బాలసురేశ్ బాబు రిబ్బన్ కట్ చేసి చలివేంద్రం ప్రారంభించారు. పోలవరానికి చెందిన రొక్కాల శ్యాంబాబు, మెషేక్ ఆధ్వర్యంలో ఈ చలివేంద్రం ఏర్పాటు చేయగా మొదటి రోజు మజ్జిగ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ ఈ వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు దాతలు ముందుకు రావడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శి సొబ్బన మోహన్, టీడీపీ ఎస్సీ సెల్ నాయకులు పిల్లి నాగరాజు, కమ్మరగూడెం యువజన నాయకులు గోకా హరికృష్ణ, పోలవరం నియోజకవర్గ పాస్టర్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఆకుమర్తి డేవిడ్ రాజు, నిర్వాహకులు రొక్కాల ఉదయ్ కిరణ్ పాల్గొన్నారు.



మానవతకు విరాళం అందజేస్తున్న దృశ్యం

మానవతకు రూ.50 వేల విరాళం

పెదపాడు, మే 8(ఆంధ్రజ్యోతి) : విద్యాభివృద్ధికి తనవంతుగా విశ్రాంత ఉపాధ్యాయిని ఆబోతుల పార్వతి మానవత స్వచ్ఛంద సేవా సంస్థకు రూ.50 వేల విరాళాన్ని అందజేసినట్టు సంస్థ సభ్యులు మారుబోయిన కోటేశ్వరరావు తెలిపారు. వీరవల్లి జడ్పీ హైస్కూల్ ఉపాధ్యాయుడు ఎం.రమణ గోపాల్ చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో గూడపాటి జయరామ చంద్రరావు, పాబోలు గణేష్, వేగిరెడ్డి సూర్యనారాయణ, కొట్నాని రామచంద్రరావు పాల్గొన్నారు.

రెడ్‌క్రాస్ మానవతావాద సంస్థ



ర్యాలీని ప్రారంభిస్తున్న రెడ్‌క్రాస్ సభ్యులు

ఏలూరు క్రైం, మే 8(ఆంధ్రజ్యోతి) : ప్రపంచ వ్యాప్తంగా సేవలందిస్తున్న అతి పెద్ద మానవతావాద సంస్థ రెడ్‌క్రాస్ సొసైటీ అని ఏలూరు జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ ఛైర్మన్ మాగంటి ప్రసాద్ అన్నారు. ప్రపంచ రెడ్‌క్రాస్ దినోత్సవం, తలసేమియా దినోత్సవ వేడులను ఏలూరు ప్రభుత్వాసుపత్రి ఆవరణలో ఉన్న రెడ్‌క్రాస్ భవనంలో ఘనంగా నిర్వహించారు. తొలుత రెడ్‌క్రాస్ వ్యవస్థాపకుడు హెన్రీ డ్యూనాంట్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఛైర్మన్ మాగంటి ప్రసాద్ మాట్లాడుతూ జిల్లాలో రెడ్‌క్రాస్ సేవలను జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి సహకారంతో మరింత విస్తృతం చేస్తామన్నారు. అనంతరం బ్లడ్‌బ్యాంక్ సెంటర్‌లో రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ వైస్ ఛైర్మన్ జె.సత్యనారాయణరాజు, ట్రెజరర్ బ్రహ్మానందం, వర ప్రసాదరావు, తోకల సికింద్ర మోహన్, కమిటీ సభ్యులు ఆలపాటి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

పేదల ఆరోగ్య సంరక్షణకు కృషి : చంటి

ఏలూరు టూటౌన్, మే8(ఆంధ్రజ్యోతి): సామాన్యుల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సీఎం సహాయ నిధి చెక్కులు పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గురువారం 23మందికి 17లక్షల 72వేల చెక్కులను పంపిణీ చేశామన్నారు. టీడీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత నియోజకవర్గంలో ఇప్పటి వరకు రూ.2 కోట్లు పంపిణీ చేశామన్నారు.



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే చంటి

నిర్వాసితులందరికీ న్యాయం చేస్తాం : ఎమ్మెల్యే బాలరాజు



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే చిర్రి

కుక్కునూరు, మే 8(ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులందరికీ న్యాయం చేస్తామని ఎమ్మెల్యే చిర్రి బాలరాజు అన్నారు. గురువారం కుక్కునూరులోని గ్రామ సచివాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. కుక్కునూరు మండలంలో ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విద్యుత్, తాగునీటి సమస్య విషయంలో అధికారులు శ్రద్ధ చూపించాలని సూచించారు. కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో 2,944 నిర్వాసిత కుటుంబాల్లో ఇంకా 158 కుటుంబాలకు పరిహారం చెల్లించాల్సి ఉందన్నారు. నిర్వాసితులకు నిర్మిస్తున్న ఇళ్లు సరిపోవడం లేదనే సమస్య మంత్రి నాదెండ్ల మనోహర్ దృష్టికి ఇటీవల తీసుకొచ్చినట్టు తెలిపారు. మరలా టెండర్లు పిలిచి నిర్వాసితుల ఇళ్లను పునర్నిర్మించేలా చర్యలు చేపడతామన్నారు. సమావేశంలో జనసేన పార్టీ జిల్లా కార్యదర్శి గడ్డమనుగు రవికుమార్, కుక్కునూరు, వేలేరుపాడు మండలాల అధ్యక్షులు ములిశెట్టి యుగంధర్, ఆదినారాయణ, ఎం.గోపాలకృష్ణ, వెంకన్నబాబు, చల్లా కోటి, తహసీల్దార్ రమేశ్‌బాబు,ఎంపీడీవో నరసింహరావు, ఎస్.ఐ. రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ధర్మకర్తల మండలి నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

పెదపాడు, మే 8(ఆంధ్రజ్యోతి) : అప్పనవీడులో ప్రసిద్ధి చెందిన అభయాంజనేయ స్వామి దేవస్థానానికి సంబంధించి ధర్మకర్తల మండలి నియామకం కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు దేవదాయ ధర్మదాయ శాఖ కార్యనిర్వహణాధికారి పీటీటీవీ సత్యనారాయణమూర్తి గురువారం తెలిపారు. ఆసక్తిగలవారు 20 రోజుల్లోగా నమూనా ఫారం -2 ద్వారా దరఖాస్తును జిల్లా దేవదాయ ధర్మదాయ శాఖ అధికారి, ఏలూరు వారికి పంపాలని కోరారు.



చెరువులో పడిపోయిన లారీ

ధాన్యం లోడు లారీ బోల్తా

ఉంగుటూరు, మే 8(ఆంధ్రజ్యోతి) : కాకర్లమూడి గ్రామంలో చెర్వు వద్ద బుధవారం రాత్రి ధాన్యం లోడు లారీ అదుపు తప్పి బోల్తా కొట్టింది. దీంతో ధాన్యం మొత్తం తడిచి పోయింది. రైతులు మార్నీడి వందనా దేవి, చేదునూరి శశి పార్వతి, ఉర్రింకల వీర వెంకట సత్య వర ప్రసాద్‌లకు చెందిన 500 బస్తాల ధాన్యం ఆ లారీలో ఉంది. ముదినేపల్లి మండలం పెద పాలపర్రు మిల్లుకు ఈ ధాన్యం వెళ్లాల్సి ఉంది. ఇదే విషయమై సంబంధిత తహసీల్దార్ రవి కుమార్ అధికారులతో మాట్లాడుతూ రైతులకు ఇబ్బందులు కలుగకుండా చూడాలని ఆదేశించారు.

ఆయుర్వేద ఆస్పత్రికి గుర్తింపు

ఉంగుటూరు, మే 8(ఆంధ్రజ్యోతి) : స్థానిక ఆయుర్వేద ఆసుపత్రికి కేంద్ర ప్రభుత్వం గుర్తింపు లభించిందని వైద్యాధికారిణి డా.కస్తూరి శిరీష, అభివృద్ధి కమిటీ సమన్వయకర్త తల్లాప్రగడ భీమేశ్వరరావులు తెలిపారు. ఈ విషయమై గురువారం గ్రామస్థులతో కలిసి తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు.త్వరలో కేంద్ర ప్రభుత్వం నుంచి సర్టిఫికెట్‌ను అందుకోనున్నట్టు తెలిపారు. 25 రకాల మొక్కలను ఈ వైద్యశాలలో అందుబాటులో ఉంచామని, తద్వారా వివిధ రకాల వైద్య నమూనాలను రోగులకు వివరిస్తున్నట్టు తెలిపారు. కేంద్ర ప్రభుత్వ నిధులతో ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రంగా నిర్వహిస్తుండగా నేడు పంచ కర్మ సెంటర్‌గా గుర్తింపు వచ్చిందన్నారు.

గంగానమ్మ జాతరకు తరలిరండి

టి.నర్సాపురం, మే 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని మధ్యాహ్నపువారిగూడెం గ్రామంలో ఈ నెల 18న నిర్వహించే గంగానమ్మ జాతరకు భక్తులు తరలిరావాలని ఆలయ కమిటీ సభ్యులు గురువారం కోరారు. ఈ నేపథ్యంలో శుక్రవారం అమ్మవారి గ్రామోత్సవం ఉంటుందని, అలాగే అఖండ అన్నసమారాధన నిర్వహించనున్నట్టు తెలిపారు.

రాట్నాలమ్మకు ఎమ్మెల్యే పూజలు

పెదవేగి, మే 8(ఆంధ్రజ్యోతి) : శ్రీరాట్నాలమ్మను ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ దర్శించుకున్నారు. శ్రీవిశ్వావసు నామ సంవత్సరం వైశాఖ శుద్ధ ఏకాదశిని పురస్కరించుకుని ఎమ్మెల్యే ప్రభాకర్ గురువారం రాట్నాలమ్మను దర్శించుకుని పూజలు జరిపారు. ఆలయార్చకులు ఎమ్మెల్యే ప్రభాకర్‌కు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఎమ్మెల్యే వెంట టీడీపీ నాయకులు మంచినేని శ్రీనివాసరావు, మన్నే శ్రీనివాసరావు, పామర్తి నాగభూషణం ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

జీలుగుమిల్లి, మే 8(ఆంధ్రజ్యోతి) : విద్యుత్ లైన్ల మరమ్మతుల నిమిత్తం శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు జంగారెడ్డిగూడెం విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పి.అహ్మద్ ఖాన్ తెలిపారు. శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1.30 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు తెలిపారు. జంగారెడ్డిగూడెం మండలంలో మైసన్నగూడెం, జీలుగుమిల్లిలో ములగలంపల్లి, పి.నారాయణపురం, రాచన్నగూడెం, కుక్కునూరు, వేలేరుపాడు, రాజీవ్‌నగర్ సబ్ స్టేషన్‌ల పరిధిలో గ్రామలకు సరఫరా నిలిచిపోతుందన్నారు. వినయోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

పంటకు గిట్టుబాటు కల్పించండి

ఉంగుటూరు, మే 8(ఆంధ్రజ్యోతి) : రైతులు పండించిన పంటలకు మద్దతు ధరల గ్యారెంటీ చట్టం తేవాలని, అన్నదాత సుఖీభవ పెట్టుబడి సాయం హామీ అమలు చేయాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ అన్నారు. గురువారం కైకరం ప్రజా సంఘాల కార్యాలయంలో కట్టా భాస్కరరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో శ్రీనివాస్ మాట్లాడుతూ ఈ నెల 20 జరిగే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలన్నారు.సమావేశంలో సీనియర్ నాయకులు గుత్తికొండ వెంకట కృష్ణారావు పాల్గొన్నారు.

అడవులను పరిరక్షించండి

డీఎఫ్‌వోను కోరిన స్వచ్ఛంద సేవకులు

ఏలూరు రూరల్, మే 8(ఆంధ్రజ్యోతి) : అడవుల పరిరక్షించాలంటూ బంజారా భజరంగీ భేరి సంఘం తరఫున భూక్యా నాగరాజు నాయక్, జరభల వెంకటకృష్ణ ప్రసాద్‌లు డిస్ట్రిక్ ఫారెస్ట్ ఆఫీసర్ శుభంకు గురువారం వినతి పత్రం అందజేశారు. అడవులను కొంత మంది దుండగులు విచ్చలవిడిగా నరికేస్తున్నారని అన్నారు. సామాజిక బాధ్యతతో భాగంగా అడవులను పెంచడం కోసం వర్షాకాలంలో బంజారా భజరంగి భేరి సంఘానికి అటవీ శాఖ నుంచి విత్తనాలు, మొక్కలు ఇవ్వాలని కోరారు. దీనిపై డీఎఫ్‌వో స్పందిస్తూ త్వరలోనే అడువుల పరిరక్షణపై క్యాంపులు పెడతామని, అడవుల రక్షణ ఉద్యమంలో ముందుకొచ్చిన సామాజిక సేవ సంఘాలకు కావలసిన మొక్కలు అటవీ శాఖ నుంచి అందిస్తామని హామీ ఇచ్చారు.

ఆపరేషన్ సింధూర్‌పై యూత్ కాంగ్రెస్ హర్షం

నూజివీడు, మే 8 (ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సింధూర్‌పై యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి గోళ్ళపవన్‌కుమార్ హర్షం వ్యక్తం చేశారు. నూజివీడులోని కాంగ్రెస్‌పార్టీ కార్యాలయంలో గురువారం ఆయన మాట్లాడుతూ ఆపరేషన్ సింధూర్‌లో ఉగ్రవాద స్థావరాలను ధ్వంసం చేసిన సైనికులకు సెల్యూట్ చేస్తున్నామన్నారు. దేశభద్రతను కాపాడే యోధులను చూసి గర్వంగా ఉందన్నారు. అత్యంత ప్రతిభావంతంగా వ్యవహరించిన మహిళ ఆర్మీ నాయకులైన సోఫియా కురేషి, వ్యోమిక సింగ్‌లకు అభినందనలు తెలుపుతున్నామన్నారు.

రైస్‌కార్డు సేవలు ప్రారంభం

నూజివీడు, మే 8 (ఆంధ్రజ్యోతి):ఈనెల 7వ తేదీ నుంచి గ్రామ, వార్డుసచివాలయాల్లో రైస్‌కార్డు సంబంధిత సేవలు ప్రారంభించబడ్డాయి. కొత్తబియ్యం కార్డు దరఖాస్తు చేసుకోవచ్చు, బియ్యం కార్డులో సభ్యుని చేర్పించడం, బియ్యం కార్డు విభజన, బియ్యం కార్డు సభ్యుల తొలగింపు, బియ్యం కార్డు సరెండర్, బియ్యం కార్డులో చిరునామా మార్పు, రైస్‌కార్డులో ఆధార్ సీడింగ్ తప్పుగా ఉంటే సరిచేయటం వంటి సేవలను పొందవచ్చునని అధికారులు తెలిపారు.

సమన్వయంతో పనిచేయాలి

(ఐదో పేజీ తరువాయి)

సిద్ధంగా ఉన్నారన్నారు. నాలుగు మండలాల్లో 5వేల ఎకరాల చొప్పున డెమో ప్లాంట్లు వేసేందుకు భూమి ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. ఈ దిశగా ఒక మోడల్‌గా ప్రకృతి వ్యవసాయాన్ని దెందులూరు నియోజకవర్గంలో తీసుకురావాలన్నారు. పెదవేగి మండలంలో దుగ్గిరాల, వంగూరుదొండపాడు,పినకడిమి, జానంపేట గ్రామాల్లో 23 ఎకరాల ఇరిగేషన్ స్థలం ఖాళీగా ఉందని, దీనికి ఎన్‌వోసీ ఇస్తే సీసీఎల్‌కు ప్రతిపాద నలు పంపి ఇళ్ల స్థలాలకు అవసరమైన భూమిని సమకూర్చే అవకాశం ఉందన్నారు. శ్మశాన వాటికలకు దారులు లేని వాటిని గుర్తించాలని, గుండుగొలను నుంచి ఏలూరుకు గోదావరి కాల్వ చివరి వరకు పూడికలు తీసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్ రోడ్లపై ఆక్రమణలు తొలగించాలని, పెదపాడు సబ్‌స్టేషన్ పనులు పూర్తి చేయాలని, రొయ్యలు, చేపల చెరువుల విద్యుత్ బిల్లు విషయంలో ఇబ్బంది పెట్టకుండా చూడాలని కోరారు. కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ జిల్లాలో వ్యవసాయ, ఉద్యాన శాఖల ద్వారా అమల వుతున్న ఆయా పథకాల వివరాలను ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకురావాలని ఆదేశించారు. జిల్లాలో జనుము, జీలుగ, గ్రీన్ మెన్యూర్ సంబంధించి 10 వేల మెట్రిక్ టన్నులు కేటాయించగా, ఇప్పటికే 4వేల మెట్రిక్ టన్నులు జిల్లాకు అందాయన్నారు.ఆయిల్ పామ్ పంట విస్తీర్ణం పెంచేందుకు రైతుల్లో అవగాహన కల్పిస్తామన్నారు. జేసీ ధాత్రిరెడ్డి, డీఆర్వో విశ్వేశ్వరరావు, ఇతరశాఖ అధికారులు పాల్గొన్నారు.



స్వామి, అమ్మవార్లకు అలంకరణ

వైభవంగా శ్రీవారి కల్యాణోత్సవాలు ప్రారంభం

కలిదిండి మే 8 (ఆంధ్రజ్యోతి): కలిదిండిలో శ్రీదేవి భూదేవి సమేత వెంకటేశ్వరస్వామి కల్యాణోత్సవాలు గురువారం వైభవంగా ప్రారంభమయ్యాయి. అర్చక స్వాములు, స్వామిని పెండ్లి కుమారుడిగా, అమ్మవార్లను పెండ్లి కుమార్తెలుగా అలంకరించారు. సహస్ర కుంకుమార్చన, కుంకుమ పూజ, వాస్తు పూజ తదితర పూజలు నిర్వహించారు. ఆలయ ఈవో కె.శ్రీనివాసు ఏర్పాట్లు పర్యవేక్షించారు. ఈ నెల 10న వెంకటేశ్వరస్వామి కల్యాణం వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు గుడిపాటి వాసుదేవరావు, నాగేశ్వరరావు, ఉమామమేశ్వరరావు, భక్తులు పాల్గొన్నారు.

ముగిసిన వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు



ఊటుకూరులో వెంకటేశ్వరస్వామికి పూజలు

ముదినేపల్లి, మే 8 (ఆంధ్రజ్యోతి): ముదినేపల్లి మండలం ఊటుకూరు గ్రామంలోని ప్రసన్న వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో మూడు రోజులుగా జరుగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాలు గురువారం ముగిశాయి. ముగింపు సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ద్వాదశ ప్రదక్షిణలు, ఊంజల్ సేవ జరిగాయి. మల్లపరాజుగూడెంకు చెందిన గెడ్డం నాగమల్లిఖార్జునరావు ఆధ్వర్యంలో భగవద్గీత పారాయణం నిర్వహించారు.

చిన వెంకన్న కల్యాణానికి ఆహ్వానం

నేత్రపర్వం.. ధ్వజారోహణం.. సకల దేవతలకు పిలుపు



ధ్వజపటానికి హారతి

ద్వారకాతిరుమల, మే 8 (ఆంధ్రజ్యోతి): బ్రహ్మాండనాయకుని బ్రహ్మోత్సవ వేడుకల సంబరం అంబరాన్నంటుతోంది. స్వామివారి కల్యాణం తిలకించేందుకు సకల చరాచర సృష్టికి, ముక్కోటి దేవతలకు ఆహ్వానం పలు కుతూ గురువారం రాత్రి జరిగిన ధ్వజారోహణ వేడుక భక్తజనకోటికి కన్నుల పండువైంది. ఇంద్రాది అష్టదిక్పాలకులు, సర్వ దేవతలు, దేవ గణాలను స్వాగతిస్తూ వేదమంత్రోచ్చరణలతో అర్చకులు శ్రీవారి ఆలయ ప్రాకారంలోని ధ్వజ స్తంభంపై గరుడపటాన్ని ఎగురవేశారు. అంతకు ముందు ఉదయం ఆలయంలో విశేష కార్యక్ర మాలు జరిగాయి. సాయంత్రం ఆలయంలో విష్వక్సేనుని ఒక వాహనంపై ఉంచి అలంక రించి, డోలు, సన్నాయివాయిద్యాల నడుమ అర్చకులు పుట్టమన్ను తెచ్చారు. అంతకు ముందే ఆలయ యాగశాలలో ఏర్పాటుచేసిన పాలికల్లో పుట్టమన్నును పోసి అంకురార్పణను శాస్త్రోక్తంగా జరిపారు. అనంతరం గరుడపటాన్ని వెండి తొళక్క వాహనంలో ఉంచి ఆ తరువాత ఆలయంలో ధ్వజారోహణ నిర్వహించారు. బ్రహ్మోత్సవాల్లో నేటి ఉదయం 7 గంటలకు సూర్యప్రభ వాహనంపై తిరువీధిసేవ 8-30 నుండి భజన సంకీర్తనలు. రాత్రి 7 గంటల నుంచి చంద్రప్రభ వాహనంపై గ్రామోత్సవం నిర్వహిస్తారు. గురువారం స్వామివారు మత్స్యా వతారంలో భక్తులకు దర్శనమిచ్చారు.దశావ తారాల్లో మొదటి అవతారం ఇది. శంఖు, చక్ర, గదాధారియై ఉన్న చిన్న తిరుమలేశుని పలు వురు భక్తులు దర్శించుకున్నారు.

సీఎం చంద్రబాబు పుస్తకావిష్కరణ

నూజివీడు, మే 8 (ఆంధ్రజ్యోతి):నూజివీడు మండలం గొల్లపల్లి గ్రామానికి చెందిన, మేఘాలయ రాష్ట్రంలోని నార్త్, ఈస్టర్న్, హిల్ యూనివర్సిటీ (ఎన్ఈహెచ్‌యూ) ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న డాక్టర్ దోనేటి శివాజీ రాష్ట్రముఖ్యమంత్రి నారాచంద్రబాబుపై రాసిన 'విజనరీ చంద్రబాబు టెక్ - జెర్నీ హైదరాబాద్ - సైబరాబాద్' అనే పుస్తకాన్ని బుధవారం సాయంత్రం సీఎం కార్యాలయంలో సీఎం చంద్రబాబు చేతులమీదుగానే ఆవిష్కరించారు. తనపై రాసిన పుస్తకాన్ని పరిశీలించిన సీఎం శివాజీకి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో శివాజీ కుటుంబసభ్యులు కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా దోనేటి శివాజీని గొల్లపల్లి గ్రామస్తులు గురువారం అభినందించారు.



చెరువుల్లో కొంగల సందడి

చాట్రాయిలో నిండుగా ఉన్న చెరువులలో కొంగలు కనువిందు చేస్తున్నాయి. ఇటీవల చాట్రాయి పెద్ద చెరువు, దీవ చెరువులను నాగార్జున సాగర్ నీటితో నింపారు. దీనితో వేలాది కొంగలు చెరువుల్లో సందడి చేస్తున్నాయి. చెరువుల సమీపంలోని ఖాళీ ప్రదేశాలలో చెట్ల పైనా కొంగలు గుంపులు గుంపులుగా కన్పిస్తుంటంతో దారిన వెళ్ళే వారు ఆగి చూస్తున్నారు.

\- చాట్రాయి





ఆకాశంలో కమ్ముకున్న మబ్బులు.. రొయ్యల చెరువుల్లో తిరుగుతున్న ఏరియేటర్లు

వాతావరణం మార్పులతో ఆక్వా ఉక్కిరిబిక్కిరి

కలిదిండి/మండవల్లి మే 8 (ఆంధ్రజ్యోతి): నాలుగు రోజులుగా వాతావరణంలో మార్పులతో ఉదయం పూట ఆకాశంలో మబ్బులు కమ్ముకుని అకాల వర్షం కురిసింది. ఆ తర్వాత ఎండ తీవ్రత అధికంగా ఉండటంతో ఉష్ణోగ్రతల్లో హెచ్చు తగ్గులతో చెరువుల్లో ఆక్సిజన్ కొరత ఏర్పడి రొయ్యలు నీటిపై తేలాడుతున్నాయి. చేపలు ఎగ్‌తో ఉండటంతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నాయి. దీంతో రైతులు ఆక్సిజన్ కొరత నివారణకు నిరంతరాయంగా చెరువుల్లో ఏరియేటర్లు, బోట్లు తిప్పుతున్నారు. ఖరీదైన మందులు చల్లుతున్నారు. మండలంలో 10 వేల ఎకరాల్లో రొయ్యల సాగు, 13 వేల ఎకరాల్లో చేపల సాగు చేస్తున్నారు. ఎకరానికి సుమారు రూ2 లక్షలు పెట్టుబడి పెట్టారు. వేసవిలో రొయ్యల సాగుకు వాతావరణం అనుకూలంగా ఉండటంతో చేపల చెరువుల్లో సైతం రొయ్యల సాగు చేపట్టారు. ప్రస్తుతం వాతావరణం తేడాగా ఉండటంతో రొయ్యల పంట చేతికి వస్తుందో రాదోనని ఆందోళన చెందుతున్నారు. రేయింబవళ్లు చెరువుల వద్ద కాపలా ఉంటూ విద్యుత్ కోత విధించిన వెంటనే జనరేటర్‌తో ఏరియేటర్లను తిప్పుతున్నారు. దీంతో డీజిల్ ఖర్చు అదనపు వ్యయమవుతుందని వాపోతున్నారు.

ఆక్సిజన్ కొరత నివారణకు చర్యలు

చెరువుల్లో ఆక్సిజన్ కొరత నివారణకు హైడ్రోజన్ పెరాక్సైడ్ తగు మోతాదులో చల్లాలని మత్స్యశాఖ ఏడీ రాజ్ కుమార్ తెలిపారు. ఎకరానికి కిలో చొప్పున ఈ మందు పిచికారి చేయాలన్నారు. చెరువుల్లో అదనంగా ఏరియేటర్లు ఏర్పాటు చేసి నిర్విరామంగా తిరుగుతూ ఉండాలన్నారు. ఉదయాన్నే చెరువుల్లో బోట్లను తిప్పుతూ ఆయిలింజన్లతో నీటిని రీ సైక్లింగ్ చేయాలన్నారు. ఈ విధంగా చేయటంతో చెరువులో కెరటాలు రావటంతో ఆక్సిజన్ ఉత్పన్నమవుతుందన్నారు. వాతావరణం చల్లగా ఉన్నప్పుడు మేత తక్కువగా వేయాలని సూచించారు.





నరసింహారావుపాలెంలో పిడుగుపాటుకు నెర్రెలిచ్చిన గృహం, కాలిన కరెంట్ వైరింగ్... ఆగిరిపల్లిలో వడగండ్ల వాన

పిడుగుపాటుకు కాలిన విద్యుత్ పరికరాలు

చాట్రాయి, మే 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని నరసింహారావుపాలెం రజకుల బజారులో గురువారం సాయంత్రం అల్లడి చెన్నారావు ఇంటి పక్కన కొబ్బరి చెట్టుపై పిడుగు పడగా, ఇంట్లో కరెంట్ మీటరు, వైరింగ్, బోర్డులు, ఫ్యాన్లు, ఫ్రిజ్ ఇతర విద్యుత్ పరికరాలు కాలిపోవటంమే కాక ఇంటి గోడలు బీటలు వారాయి. ఉరుములు, మెరుపులులతో వర్షం పడుతున్న సమయంలో కొబ్బరి చెట్టుపై పెద్ద శబ్దంతో పిడుగు పడిందని, తరువాత షాక్ తగిలినట్లు అనిపించి 15 నిమిషాలు పాటు నోట మాట రాలేదని బాధిత కుటుంబ సభ్యులు చెప్పారు. పిడుగుపాటుకు చుట్టు పక్కల 20 ఇళ్ళలో ఫ్యాన్లు ఫ్రిజ్‌లు ఇతర వస్తువులు కాలిపోయాయని గ్రామస్థులు తెలిపారు.

ఆగిరిపల్లిలో వడగండ్ల వాన

ఆగిరిపల్లి, మే 8 (ఆంధ్రజ్యోతి):ఆగిరిపల్లిలో గురువారం మధ్యాహ్నం ఈదురుగాలులతో పాటు వడగండ్ల వర్షం కురిసింది. ఉరుములు, మెరుపులుతో కూడిన వర్షం పడుతున్నందున విద్యుత్ సరఫరా నిలిపివేశారు. ఆగిరిపల్లిలో 20 నిమిషాల పాటు వర్షం కురవడంతో ప్రధాన రోడ్లు, మురుగు కాలువలు వర్షపు నీటితో నిండిపోయాయి. వడగండ్ల వాన వల్ల మామిడి కాయలకు నష్టం వాటిల్లిందని మామిడి రైతులు వాపోతున్నారు.

విద్యార్థులకు కథల బోధన



ముదినేపల్లి, మే 8 (ఆంధ్రజ్యోతి): వేసవి విజ్ఞాన శిబిరాల్లో భాగంగా గురువారం ముదినేపల్లి శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు నీతి కథలు, జాతీయ నాయకుల జీవిత విశేషాలను బోధించారు. గ్రంథాలయాధికారిణి ఎం.శ్రీదేవి విద్యార్థులకు పొడుపు కథలను నేర్పించారు. వివిధ పాఠశాలలకు చెందిన సుమారు 40 మంది విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు.

పాములోళ్ల కాలనీకి నీటి కుళాయి



తాగునీటి కుళాయిని ప్రారంభిస్తున్న సర్పంచ్ విశ్వేశ్వరరావు

ముదినేపల్లి, మే 8 (ఆంధ్రజ్యోతి): ముదినేపల్లి మండలం శ్రీహరిపురం గ్రామపంచాయతీ ఏరియాలోని పాముల సామాజిక వర్గం నివసిస్తున్న ప్రాంతానికి రక్షిత మంచినీటి పథకం పైపులైన్‌నుఏర్పాటు చేశారు. సుమారు 20 కుటుంబాలకు చెందిన 60 మందికిపైగా తాగునీటి సౌకర్యం ఏర్పడింది. దీంతో వారి చిరకాల వాంఛ నెరవేరినట్లయింది. ఆ గ్రామపంచాయతీ ఏరియాలో సుమారు 30 సంవత్సరాలుగా నివసిస్తున్న పాముల కులస్థులు తమకు రక్షిత నీటి పథకం కుళాయిని ఏర్పాటు చేయాలని కోరుతూనే ఉన్నారు. నీటి కోసం వారు ఎన్నో ఇబ్బందులు పడ్డారు. దీంతో సర్పంచ్ పరసా విశ్వేశ్వరరావు చొరవ తీసుకుని సుమారు రూ.50 వేల వ్యయంతో మెయిన్ పైపులైన్ నుంచి వారి నివాస ప్రాంతానికి పైపులైన్ ఏర్పాటు చేశారు. కుళాయి ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఉపసర్పంచ్ బత్తుల నాగేశ్వరమ్మ, పంచాయతీ సభ్యులు పాల్గొన్నారు.

పోలీసుల మాక్‌డ్రిల్

నూజివీడు, మే 8 (ఆంధ్రజ్యోతి):నూజివీడులో గురువారం పోలీసులు మాక్ డ్రిల్ నిర్వహించారు. డీఎస్పీ కె.వి ప్రసాద్ ఆధ్వర్యంలో నూజివీడు టౌన్, రూరల్ ఇన్‌స్పెక్టర్లు సత్యశ్రీనివాస్, కె.రామకృష్ణ, ఎస్సై జ్యోతి బాసు ఆధ్వర్యంలో నూజివీడు ప్రధాన వీధుల్లో మాక్‌డ్రిల్ నిర్వహించారు. సంఘ విద్రోహ చర్యలను నిరోధించటం, శాంతిభద్రతల పరిరక్షణ, ప్రజల్లో భద్రత భావాన్ని పెంపొందించటం ఈ డ్రిల్ ముఖ్య ఉద్దేశమని ఎస్సైలు స్పష్టం చేశారు. ప్రమాదాలు, పేలుళ్ళ, అనుమానాస్పద వస్తువులు గుర్తించినప్పుడు ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి, సైరన్ మోగినప్పుడు స్పందించాల్సిన విధానాల వంటి అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. అత్యవసర పరిస్థితిలో పోలీసులు, ఇతరశాఖల సమన్వయంతో చేపట్టిన చర్యలను వివరించారు. అనుమానాస్పదంగా ఏదైనా కనిపిస్తే పోలీసులకు చెప్పాలన్నారు

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	140, 149, 160
చికెన్ విత్ స్కిన్	270
చికెన్ స్కిన్‌లెస్	280

నెక్ కోడి గుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ.475

12 వాహనాలపై కేసులు



మండవల్లిలో వాహనాలు తనిఖీ చేస్తున్న జగదీష్, ప్రజ్ఞ

మండవల్లి మే 8(ఆంధ్రజ్యోతి): ప్రతి వాహనదారుడు డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని, మోటారు సైకిల్ నడిపేవారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని అసిస్టెంట్ మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ జగదీష్ తెలిపారు. మండలంలోని లోకుముడి, చావలిపాడు గ్రామాలలో జాతీయ రహదారిపై వాహనాల రికార్డులను తనిఖీ చేశారు. రికార్డులు సరిగ్గాలేని 12 వాహనాలపై కేసులు నమోదు చేసినట్లు అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ప్రజ్ఞ తెలిపారు.

రహదారిపై ఆక్రమణల తొలగింపు



జాతీయ రహదారి వెంబడి మట్టిని యంత్రాలతో తొలగిస్తున్న దృశ్యం

కైకలూరు, మే 8 (ఆంధ్రజ్యోతి): కైకలూరు పట్టణంలో ఆక్రమణలను గ్రామపంచాయతీ అధికారులు తొలగించారు. గురువారం కైకలూరులో జాతీయ రహదారి వెంబడి ఇరువైపులా ఉన్న దుకాణాలను, బడ్డీకొట్లను తొలగించారు. రహదారిపై ఉన్న మట్టిని యంత్రాల సహాయంతో ట్రాక్టర్ల ద్వారా బయటకు తరలించారు. దీంతో రహదారి దుమ్ముధూళి లేకుండా కనిపిస్తున్నది. అలాగే రహదారి వెంబడి ఉన్న డ్రెయిన్లలో మట్టిని పారిశుధ్య కార్మికులతో తొలగించినట్టు పంచాయతీ కార్యదర్శి ఆనందభూషణం తెలిపారు.

రైతులకు నష్ట పరిహారం చెల్లింపు

నూజివీడు, మే 8 (ఆంధ్రజ్యోతి): సీపీఐ, రైతుసంఘాల పోరాటం ఫలితంగా నూజివీడు మండలం బోర్వంచ గ్రామంలో సీడ్ మొక్కజొన్న బాధిత 15మంది రైతులకు నూర్టన్ సీడ్స్ కంపెనీ ఆర్గనైజర్ గురువారం నూజివీడు అమర్‌భవన్‌లో రూ.9లక్షల నష్టపరిహార చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్రసమితి నాయకుడు చలసాని రామారావు మాట్లాడుతూ పేదల ప్రతి సమస్యకు పోరాటం ద్వారానే పరిష్కారమవుతుందని తెలిపారు. ప్రభుత్వ, వ్యవసాయ అధికారులు నిరంతర పర్యవేక్షణ లేకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. సీపీఐ నేత నిమ్మగడ్డ నరసింహా మాట్లాడుతూ వచ్చే సీజన్‌లో రైతులు ఖచ్చితంగా కంపెనీలతో ఒప్పంద పత్రం రాసుకోవాలని సూచించారు.

ముగిసిన సహాయ మాత ఉత్సవాలు



ముదినేపల్లి, మే 8 (ఆంధ్రజ్యోతి): ముదినేపల్లిలోని ఆర్‌సీఎం చర్చి ఆధ్వర్యంలో మూడు రోజులుగా జరుగుతున్న సహాయ మాత మహోత్సవాలు గురువారంతో ముగిశాయి. ముగింపు సందర్భంగా సహాయ మాతను స్వరూపిణిగా ముదినేపల్లిలో ఊరేగింది. విశ్వాసులు ప్రదక్షిణలు చేశారు. చర్చి ఫాదర్ కమతం మరియదాసు ఆధ్వర్యంలో నిర్వహించిన ఆరాధన కార్యక్రమాల్లో క్రైస్తవ సంఘ పెద్దలు, సహాయ మాత దళం సభ్యులు తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఆర్‌సీఎం చర్చిలో ప్రార్థనలు జరిపారు. ఈ సందర్భంగా సింగరాయపాలెం బృందం నిర్వహించిన ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి.

జనసేన ఆర్థిక సాయం

ముసునూరు, మే 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రమణక్కపేటకు చెందిన జనసేన మండల ప్రధాన కార్యదర్శి వేట త్రినాథ్ తండ్రి రాంబాబు ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. ప్రస్తుతం ఆసుపత్రి ఖర్చుల నిమిత్తం జనసేన సెంట్రల్ ఆంధ్ర కమిటీ సభ్యులు పాశం నాగబాబు రూ.15వేలు నగదును గురువారం బాధిత కుటుంబానికి అందజేశారు.



రమణక్కపేటలో జాతీయ జెండాలతో హెచ్ఎం తదితరులు

ఉగ్రమూక ఏరివేతకు మద్దతు తెలపాలి

ముసునూరు, మే 8 (ఆంధ్రజ్యోతి): పాకిస్తాన్‌లోని ఉగ్రమూక ఏరివేత చర్యలకు ప్రజలంతా మద్దతు తెలపాలని ప్రధానోపాధ్యాయులు పసుమర్తి రామకృష్ణ కోరారు. గురువారం రమణక్కపేట పాఠశాలలో జాతీయ జెండాలను పట్టుకుని ఉపాధ్యాయులు, విద్యార్థులు భారతదేశ చర్యలకు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఎంసీ ఛైర్మన్ నీలకొండ రాజా, ఉపాధ్యాయులు అంగిడి శ్రీనివాసరావు, ఆశావర్కర్ సూర్యకుమారి తదితరులు పాల్గొన్నారు.

ఉగ్రవాదుల స్థావరాలు ధ్వంసం అభినందనీయం

కైకలూరు, మే 8(ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సింధూర్ పేరిట ఉగ్రవాదుల స్థావరాలను ధ్వంసం చేయడం అభినందనీయమని ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ అన్నారు. ఉగ్రస్థావరాలను మట్టుపెట్టిన సైనికుల సేవలు ఉన్నతమైనవని, ప్రపంచం భారత్‌వైపు చూసేలా సైనిక చర్యలు చేపట్టా రన్నారు. పహల్గాంలో మృతి చెందిన వారికి నిజమైన నివాళులు దేశం అందించిందన్నారు.

బలివే ధర్మకర్తల మండలికి నోటిఫికేషన్

ముసునూరు, మే 8 (ఆంధ్రజ్యోతి): బలివే రామలింగేశ్వర స్వామి ఆలయానికి నూతన ధర్మకర్తల మండలి ఏర్పాటు చేయుటకు దేవదాయ ధర్మదాయశాఖ కమిషనర్ గురువారం నోఫికేషన్‌ను విడుదల చేసినట్లు ఆలయ ఈవో వై.ఆలివేణి శ్రీ నాగలక్ష్మీదేవి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ధర్మకర్త పదవికి అర్హతలు హిందువులై ధ్రువీకరణ పత్రం ఉండాలని, దరఖాస్తుదారుని వయస్సు 30 ఏళ్ళు పైబడి ఉండాలని, సత్ప్రవర్తన కలిగిన వారై ఉండాలని, అభ్యర్థుల పూర్వపరాలను విచారించే సమయంలో పోలీస్ ఎంక్వైరీ సర్టిఫికెట్, కుల ధ్రువీకరణ పత్రం, మెడికల్ ఫిట్నెస్ సర్టిఫికెట్ తప్పనిసరిగా సమర్పించాలని ఈవో వివరించారు. ఆసక్తి గల వారు దేవస్థానంలో ఉన్న కార్యాలయంలో ఫారమ్-11 సెక్షన్ 17(3) దరఖాస్తు పత్రాలను పొంది, పూర్తి చేసి ఈ నెల 26వ తేదీ లోపు జిల్లా దేవదాయ ధర్మదాయ శాఖ అధికారి కార్యాలయంలో అందజేయాలని ఆమె కోరారు.

నూజివీడు: నూజివీడు మండలం గొల్లపల్లిలోని రఘునాథస్వామి ఆలయానికి నూతన ధర్మకర్తల మండలి ఏర్పాటుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు కార్యనిర్వహణ అధికారి నల్లూరి సతీష్‌కుమార్ తెలిపారు. ధర్మకర్త పదవికి అర్హులైన, ఆసక్తిగల వారు గొల్లపల్లిలోని దేవస్థానం కార్యాలయం పనివేళల్లో దరఖాస్తు పత్రాలు తీసుకుని పూర్తిచేసి ఈనెల 25వ తేదీలోపు ఏలూరులోని జిల్లా దేవదాయధర్మాదాయశాఖ అధికారి కార్యాలయంలో ఇవ్వాలని తెలిపారు.

విద్యార్థులు సెల్ ఫోన్లకు దూరంగా ఉండాలి



వేసవి విజ్ఞాన శిబిరంలో మాట్లాడుతున్న తహసీల్దార్ రామకృష్ణ

కలిదిండి మే 8 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు సెల్ ఫోన్లకు దూరంగా ఉంటూ చదువుపై శ్రద్ధ పెట్టాలని తహసీల్దార్ రామకృష్ణ సూచించారు. గురువారం వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా కలిదిండి గ్రంథాలయంలో విద్యార్థులకు సెల్ ఫోన్ల వల్ల కలిగే అనర్థాలు, పుస్తక పఠనంతో ఉపయోగాలు వివరించారు. అనంతరం విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. కోరుకొల్లు గ్రంథాలయంలో విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కలిదిండి గ్రంథాలయాధికారి జె.రమేష్ బాబు, కోరుకొల్లు గ్రంథాలయాధికారి రాఘవులు పాల్గొన్నారు.



తేరా రమేష్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న కూటమి నేతలు

రమేశ్ మృతి టీడీపీకి తీరని లోటు

కైకలూరు, మే 8 (ఆంధ్రజ్యోతి): కైకలూరు మండలం వేమవరప్పాడు నియోజకవర్గ తెలుగుదేశంపార్టీ నియోజకవర్గం కోకన్వీనర్, ఎస్సీసెల్ అధ్యక్షుడు తేరా రమేష్‌బాబు సంతాప సభను నిర్వహించి చిత్రపటానికి నివాళులర్పించారు. పార్టీ అధికారంలో ఉన్న ప్రతిపక్షంలో ఉన్న పార్టీ వెన్నంటే ఉండి మంచి మనిషిగా గుర్తింపు తెచ్చుకున్న వ్యక్తి అని ఆకస్మికంగా రమేశ్ మృతి పార్టీని తీరనిలోటని పలువురు కొనియాడారు. సంతాపసభలో మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠలరావు, నియోజకవర్గ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు, కోకన్వీనర్లు కొడాలి వినోద్, బలే ఏసురాజు, రాష్ట్రచేపలరైతు సంఘం అధ్యక్షుడు తాడినాడ బాబు, రాష్ట్ర తెలుగుయువత కార్యనిర్వాహక కార్యదర్శి పూల రామచంద్రరావు, మండల టీడీపీ అధ్యక్షుడు పెన్మెత్స త్రినాధరాజు, వైస్ ఎంపీపీ రామకృష్ణ పాల్గొన్నారు.